ఆంధ్రజ్యోతి

****

ANDHRAJYOTHY

నల్లగొండ

5

ఆదివారం 15 డిసెంబరు 2024



పోస్ట్..పోస్ట్

- ఈ రంగంలోనూ రాణిస్తున్న మహిళలు
- ఓ వైపు ఇంటి పనులు.. మరోవైపు విధులు
- ఆటంకాలెదురవుతున్నా ఆత్మస్థైర్యంతో ముందుకు
- ప్రశంసలు అందుకుంటున్న పోస్ట్ ఉమెన్‌లు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

వృత్తి ఏదైనా పురుషులకు ధీటుగా మహిళలు రాణిస్తున్నారు. భిన్నమైన పనివిధానమైనా మెరుగైన విధులు నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు మహిళా పోస్టల్ ఉద్యోగులు. పోస్ట్ ఉమెన్‌గా, గ్రామీణ డాక్ సేవక్‌లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 100 మందికిపైగా మహిళలు పనిచేస్తూ సత్తా చాటుతున్నారు. ఓ వైపు గృహిణిగా ఇంటిని చూసుకుంటూనే మరోవైపు ఉద్యోగ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. పని చేసే క్రమంలో ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదురవుతున్నా చిరునవ్వుతో సమాధానమిస్తూ ముందుకెళ్తున్నారు. సైకిళ్లపై, బైక్‌లపై రయ్...రయ్‌మని వెళ్తూ విజయవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. సహోద్యోగులు, అధికారుల ప్రశంసలతో పాటు, ప్రజల మన్ననలు పొందుతూ నేటి యువతులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న మహిళా పోస్ట్ ఉమెన్‌లపై ప్రత్యేక కథనం.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

పోస్ట్ ఉమెన్, గ్రామీణ డాక్‌సేవక్ మిగతా ఉద్యోగాల్లా ఉండదు. పనివేళలు మొదలు, పని విధానం వరకు అన్నీ భిన్నంగానే ఉంటాయి. ఇతర ఉద్యోగుల్లా కుర్చీలో కూర్చొని చేసే ఉద్యోగం కాదు. కార్మికుల్లా ఎండైనా, వానైనా, చలైనా వెరకవకుండా పార్శిళ్ల బ్యాగులను మెడకు వేసుకొని ఇంటింటికీ తిరిగి అందజేయాల్సి ఉంటుంది. తెల్లవారుజామునే లేచి ఇంట్లో పనులు పూర్తిచేసుకొని, యూనిఫామ్ వేసుకొని సైకిల్‌పైనో, స్కూటీపైనో 8గంటలకు పోస్టాఫీసుకు చేరుకుంటారు. అక్కడ అధికారులు, సూపర్‌వైజర్ల నేతృత్వంలో సార్టింగ్ పూర్తయ్యాక బ్యాగులను, పార్శిళ్లను తీసుకొని అడ్రసుల జాబితా వెంటపెట్టుకొని వెళ్తారు. అడ్రస్ దొరక్కపోతే ఫోన్లు చేసి కనుక్కోవాలి. ఫోన్లో మాట్లాడే వారి బాష అర్థం కాకపోతే పక్కనున్న ఇంకొకరితో మాట్లాడించాలి. అంతేకాదు, కొందరు ఇచ్చిన అడ్రస్ సరిపోలకపోతే ఆ పార్శిల్‌ను మరోసారి క్రాస్ చెక్ చేసే బాధ్యత వీరిదే. పనిచేసే క్రమంలో కొన్నిచోట్ల మద్దతు, ఆదరణ లభిస్తుంటే, మరికొన్ని చోట్ల మహిళలనే చులకన భావన, చిన్న చూపును వీరు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ అధిగమిస్తూ విధి నిర్వహణలో ముందుకెళ్తున్నారు. పేరుకు 8గంటల డ్యూటీ అయినా ఒక్కో రోజు 10 నుంచి 12గంటల వరకు సైతం పనిచేయాల్సి వస్తుంది. డ్యూటీ చార్ట్ ప్రకారం కేవలం పోస్ట్ ఉమెన్‌గా విధులేగాక, అదనంగా పోస్టల్‌శాఖ ఇటీవల చేపట్టిన ఇన్సూరెన్స్ పాలసీలు, డిపాజిట్లసేకరణ, పలు రకాల స్కీముల నిర్వహణ చేస్తూ అదనపు టాస్కులను కూడా విజయవంతంగా పూర్తిచేస్తున్నారు. పురుష ఉద్యోగులకు ధీటుగా వృత్తిలో రాణిస్తూ ఈ పోస్ట్ ఉమెన్‌లు ఆదర్శంగా నిలుస్తున్నారు.

క్షేత్రస్థాయిలో ఎన్నో సమస్యలు

పోస్ట్ ఉమెన్ క్షేత్రస్థాయిలో పార్శిళ్ల డెలివరీ ఇచ్చేందుకు వెళ్లినప్పుడు పలు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లేఖలు మొదలు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, ఇంటర్వ్యూ లెటర్లు, పాన్‌కార్డులు, ఆధార్ కార్డులు, పాస్‌పోర్టులతో పాటు మరోవైపు పుస్తకాలు, రకరకాల పార్శిళ్లు పోస్టు ద్వారా వస్తే వాటిని సదరు అడ్రస్‌లో డెలివరీ ఇవ్వాల్సి ఉంటుంది. పోస్టల్‌శాఖ నిబంధనల ప్రకారం కొన్నింటికి ఎలాంటి అకనాలెడ్జ్‌మెంట్ అవసరం లేకుండా డెలివరీ ఇస్తే సరిపోతుంది. మరికొన్నింటికి మాత్రం డెలివరీ తీసుకున్నట్టు సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో నిబంధనలు తెలిసిన వారు సంతకం పెడుతుంటే, మరికొందరు మాత్రం సంతకం చేసేదిలేదని మొండికేస్తున్నారు. దీంతో ఇబ్బందులుపడుతున్నామని పోస్టల్ ఉమెన్‌లు పేర్కొంటున్నారు. ప్రధానంగా అడ్రస్ దొరక్కపోతే, వారి ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి, వారిని వెతికిపట్టుకొని ఇవ్వాల్సి వస్తోందని, ఇలాంటి సమయంలో తమ బీట్ పరిధి దాటి వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోందని చెబుతున్నారు. లీగల్ నోటీసులు, బ్యాంకు నోటీసుల వంటివి వచ్చినప్పుడు కొందరు వాటిని చదివాక రిసీవ్ చేసుకుంటామని సతాయిస్తున్నారని, ఇలాంటి సందర్భాల్లో ఇబ్బంది ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. మరికొందరు ఇళ్లలోనే ఉండి కూడా తాము లేమని చెబుతుంటారని, ఆ లేఖ లేక నోటీస్ వారిది కాదని పేర్కొంటుంటారని, ఇలాంటి సమయాల్లో...

- మిగతా 7వ పేజీలో...

మనవాళ్లూ మెరికలే..

చెక్ క్రీడలో రాణిస్తున్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



పిన్న వయసులో దొమ్మరాజు గుకేష్ 64 గళ్ల సామ్రాజ్యంలో విశ్వవిజేతగా నిలిచి చరిత్ర సృష్టించాడు. తెలుగు మూలాలున్న గుకేష్ చెస్ ప్రపంచానికి రారాజుగా నిలిచి ఎందరికో ఆదర్శగా మారాడు. మన ఉమ్మడి జిల్లాకు చెందిన ఎందో చెస్ క్రీడలో రాణిస్తున్నారు. మిర్యాలగూడకు చెందిన మాశెట్టి దివ్య క్రీడాభిమానులకు సుపరిచయం. చిరుప్రాయంలోనే చదరంగం(చెస్)లోకి అడుగిడిన దివ్య జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చూపడంతో పాటు అంతర్జాతీయ స్థాయి చెస్ పోటీల్లో అదరగొట్టింది. మిర్యాలగూడకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చేందుకే డైమండ్ చెస్ అకాడమీ స్థాపించి తెలుగు వారికి ఆన్‌లైన్‌లో ఆటలో మెళకువలు నేర్పిస్తోంది. బ్లైండ్ ఫోల్డెడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అనుమతిచ్చింది. సూర్యాపేటకు చెందిన చంద్రోలు దివ్యభవానీ ఇప్పటికే ఐదు అంతర్జాతీయ స్థాయి, 20కి పైగా రాష్ట్ర స్థాయి, 56కు పైగా జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. ఈ ఏడాది బుద్ధఫెస్ట్ హంగేరిలో నిర్వహించిన అండర్-16 విభాగంలో అన్‌రెడెడ్ ప్రిన్సెస్ ఆఫ్ ది వరల్డ్-2023 అవార్డును ప్రపంచ చెస్ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ నుంచి అందుకుంది. సూర్యాపేటకే చెందిన కప్పల ఇందిరా భువనేశ్వరి ఇప్పటివరకు రెండు అంతర్జాతీయ స్థాయి, మూడు జాతీయ స్థాయి, 10కి పైగా రాష్ట్ర స్థాయి, 30కి పైగా జిల్లా స్థాయి చదరంగ పోటీల్లో బహుమతులు సాధించింది.

6

మహిళతో ఖాకీ

వివాహేతర సంబంధం?

భార్య, అతడితో ప్రాణహాని ఉందని ఎస్పీకి ఫిర్యాదు చేసిన భర్త



నల్లగొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఆ పోలీస్ అక్రమ సంబంధంతో తమ కుటుంబంలో వివాదం చెలరేగిందని అతడి భర్త జిల్లా పోలీస్‌బాస్‌కు ఫిర్యాదు చేశాడు. పెళ్లయిన ఓ సీఐ, ఇద్దరు పిల్లలున్న తన భార్యతో రహస్య సంబంధం నడుపుతున్నాడని అతడు ఆరోపిస్తున్నాడు. అంతేగాక వారిద్దను తనను వేధిస్తున్నారని, భూమి విక్రయించి డబ్బు ఇవ్వాలని హెచ్చరిస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదుచేశాడు. అంతేగాక వారిద్దరి నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని వేడుకోవడం పోలీస్‌వర్గాల్లో సంచలనం రేకెత్తించింది. ఈ ఘటనపై ఎస్పీ శరత్‌చంద్ర పవార్ డీఎస్పీ ద్వారా విచారణ చేయిస్తున్నారు.

7

ఎరువులు అధిక ధరలకు

విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



నల్లగొండ అగ్రోస్ లిమిటెడ్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ, డిసెంబరు 14:(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని మల్లికార్జున అగ్రోకెమికల్స్, నల్లగొండ అగ్రోస్ లిమిటెడ్, మిర్యాలగూడ రైతుమిత్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేసి శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన, కంపెనీ ఎరువులనే విక్రయించాలన్నారు. డీఏపీ, యూరియా ధర కంటే తక్కువకు లభించే నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గత సీజన్ కంటే యాసంగిలో మరో 20వేల ఎకరాల్లో అదనంగా పంటలు సాగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు విత్తనాలను, ఎరువులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మునుగోడు ఏడీఏ వేణుగోపాల్, కేతేపల్లి ఏవో పురుషోత్తం, మిర్యాలగూడ ఏవో సైదానాయక్, ఏఈవో షఫీ, తదితరులు పాల్గొన్నారు.

22న ఆదర్శ రైతులకు పుడమిపుత్ర అవార్డులు

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 14: యాదగిరిగుట్టలో ఈనెల 22న నిర్వహించే రైతు సదస్సులో రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న 115మంది ఆదర్శ రైతులకు పుడమిపుత్ర అవార్డులను అందజేయనున్నట్లు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, రైతు సదస్సు కన్వీనర్ పడమటి పావని తెలిపారు. శనివారం నల్లగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అదేవిధంగా శాస్త్రవేత్తలకు కిసాన్ సేవా రత్న అవార్డులు అందజేస్తామన్నారు. ఈ సదస్సులో రైతుల ఉత్పత్తులను ప్రదర్శిస్తామని, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కోసం ఒక అడుగు పొడవు ఉన్న 500 గాంధీ విగ్రహాలను ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో నాయకులు మెరుగు మధు, బొమ్మపాల గిరిబాబు, అశోక్, అనిత, బాలరాజు, పాముల అశోక్, అజీజ్, జ్యోతి, వెంకట్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలి

ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ డిప్యూటీ కార్యదర్శి భవేశ్ మిశ్రా



బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

నల్లగొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలతో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ డిప్యూటీ కార్యదర్శి భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గంధంవారి గూడెం ఎస్సీ బాలికల గురుకులంలో డైట్ కామన్ మెనూను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా డైట్ చార్జీలు, 16 ఏళ్లుగా కాస్మెటిక్ చార్జీలు పెంచకపోవడంతో ఇబ్బందులెదురయ్యాయని, ఇకపై ఆ సమస్య తీరుతుందన్నారు. అన్ని రెసిడెన్షియల్స్‌లో డైట్ చార్జీలు 40శాతం, కాస్మెటిక్ చార్జీలను 200శాతం ప్రభుత్వం పెంచిందన్నారు. పాఠశాలలు, గురుకులాల్లో భోజనం తయారీ, నాణ్యత పరిశీలనకు ప్రభుత్వం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికలతో ఆయన ముచ్చటించారు. వారితో కలిసి ప్రార్థన చేశారు. ఏ సమస్య ఉన్నా తనకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మెనూను పక్కాగా అమలు చేయాలి : కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, మునుగోడు): ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. శనివారం మునుగోడులోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో కామన్ డైట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడిన పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డైట్ మెనూ అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ప్రతీ పాఠశాలలో ఆహార భద్రత కమిటీ ఏర్పాటుచేసి నిరంతరం భోజనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి ఉంచాలని, ప్రతీ విద్యార్థి ఆరోగ్య ప్రొఫైల్‌ను పర్యవేక్షించాలన్నారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే బాధ్యత ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులదేన్నారు. తొలుత కలెక్టర్‌కు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీపీవో, మండల ప్రత్యేకాధికారి మురళీ, ఎంపీడీవో విజయ్ భాస్కర్, గురుకుల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

చదువులతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ : ఎస్పీ

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): ప్రభుత్వం విద్యార్థుల చదువులతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతోందని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. శనివారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో కామన్ డైట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం స్టోర్ రూమ్, కిచెన్‌ను, పరిసరాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్బీ సీఐ రాఘవరావు, టూటౌన్ సీఐ డానియల్, తదితరులు ఉన్నారు.

నేడు, రేపు గ్రూపు-2 పరీక్షలు

నల్లగొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో జిల్లాలో గ్రూపు-2 పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 29,118 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు నల్లగొండలో 59 కేంద్రాలు, మిర్యాలగూడ పట్టణంలో 28 కేంద్రాలు ఏర్పాటు చేశారు. నల్లగొండలో 21,777మంది అభ్యర్థులు, మిర్యాలగూడలో 7,941మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు ముగ్గురు రీజనల్ కోఆర్డినేటర్లు, 99మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 31మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 17మంది జాయింట్ రూట్ ఆఫీసర్లు, 244మంది ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లను నియమించారు. గ్రూపు-2 పరీక్ష కేంద్రం ఉన్న అన్ని పాఠశాలలకు రెండు రోజులు సెలవు ప్రకటించారు. పరీక్షలు ఉదయం 10 నుంచి 12.30గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహించనున్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా

ముందుకు సాగాలి

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ముందుకుసాగాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్బీఆర్ గార్డెన్స్‌లో బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి గండి వీరేందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊరికి ఒకరు కలిసి వస్తే రాష్ట్రంలో, దేశంలో రాజకీయ పార్టీలకు బీసీలపై అనివార్యత సృష్టిస్తామని, ఇంటికొకరు కలిసి వస్తే రాజ్యాధికారాన్ని అట్టడుగు వర్గాల చేతిలో బహుమతిగా అందిస్తామని అన్నారు. అట్టడుగు వర్గాలు పోరాడకపోవడం వల్లే అగ్రవర్గాల ఆజమాయిషీ కొనసాగుతోందన్నారు. అధికారం కోసం బీసీలు తిరగబడితే అనివార్యంగా వారు కుర్చీలు ఖాళీ చేసే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఉపకరించేలా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. యువత, మహిళలు రాజకీయాల్లోకి రావాలన్నారు. బీసీల నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ అన్ని జిల్లాల్లో నాయకత్వ నిర్మాణాన్ని చేపట్టామని, యువ నాయకులను, మహిళలను ప్రోత్సహిస్తూ వారిని స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలుపుతామన్నారు. బహుజన ముక్తి పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు దాసు రామ్‌నాయక్ మాట్లాడుతూ, ఎటువంటి ప్రాతిపదిక లేకుండా అశాస్త్రీయంగా, అన్యాయంగా పార్లమెంటులో అగ్రవర్ణ ఆధిపత్య పార్టీల ఆమోదంతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు దొడ్డిదారిన ప్రవేశపెట్టారన్నారు. దీంతో నేడు అట్టడుగు వర్గాలకు విద్య, ఉద్యోగ అవకాశాలు తగ్గి యువత నైరాశంలోకి వెళ్తోందన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జెల్ల మార్కెండేయ మాట్లాడుతూ, బీసీల ఓట్లు బయటికి వెళ్లకుండా కట్టడిచేసేలా వ్యూహాలను రచిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి యాదగిరి, లింగం చిరంజీవి, బొంగు ప్రసాద్, నూనె వెంకటస్వామి, తండు సైదులుగౌడ్, రఫీ, పంతులు, మధుబాబు, పున్న పవన్‌కుమార్, మారంశీను, దాశరాజు జయరాజు, దొంత ఆనందం, మడత కిశోర్, భారత మురళీధర్, భండారి పద్మావతి, అచ్చ నాగమణి, జంగోని స్వరూప, కుమార్‌గౌడ్, పెద్దగాని కుమారస్వామి యాదవ్, గంజి నాగరాజు, రమేష్, శంకర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయం కోసమే లోక్ అదాలత్ ఏర్పాటు

జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సత్వర న్యాయ సహాయం కోసమే లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని న్యాయ సేవా సదన్ భవనంలో లోక్ అదాలత్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా అమూల్యమైన కాలాన్ని కాపాడుకోవడమే కాకుండా ప్రశాంత జీవనం సాగించవచ్చని అన్నారు. అనంతరం వివిధ కేసులను ఇతర న్యాయమూర్తులతో కలిసి పరిష్కరించారు. లోక్ అదాలత్‌లో 72 సివిల్ కేసులు, 4,787 క్రిమినల్ కేసులు, 86 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 9 బ్యాంక్ కేసులు, 15 సైబర్ క్రైం కేసులు, 230 విద్యుత్‌శాఖ కేసులు, 9,251 ట్రాఫిక్ చలానా కేసులు, మొత్తం 44,358 పెండింగ్, ప్రీ లిటికేషన్ కేసులను పరిష్కరించారు. ప్రమాద బీమా కేసుల్లో 4,09,38,000 నష్ట పరిహారాన్ని ఇప్పించగా, బ్యాంకు కేసులకు సంబంధించి రూ.3,55,000 రుణ పరిహారం ఇప్పించారు. దీంతో పాటు క్రైం కేసుల్లో రూ.1,14,385 రికవరీ చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి తేజో కార్తీక్, న్యాయమూర్తులు దుర్గ ప్రసాద్, కవిత, శిరీష, సౌందర్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, లింగయ్య, మాతంగి వీరబాబు, సింగపంగ జంగయ్య, పాల్గొన్నారు.

పెండింగ్ కేసులకు పరిష్కారం

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ లీగల్): పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతాయని న్యాయ సేవా సంస్థ చైర్మన్, ఐదో అదనపు జిల్లా జడ్జి జి.వేణు అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన లోక్‌అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బత్తుల సుజయ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సుమబాల, స్పెషల్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీదేవి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకినాల వేలాద్రి, ఏజీపీ గోదాల వెంకట్‌రెడ్డి, ఏపోబి కళ, తదితరులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 118 కేసులను పరిష్కరించి, మోటార్ యాక్సిడెంట్ కేసుల్లో రూ.32,05,760 బాధితులకు చెల్లించేలా ఆదేశించారు.

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): దేవరకొండలో అదాలత్‌లో ఏడు సివిల్, 110 క్రిమినల్, 49 ఎక్సైజ్, 212 డ్రంకెన్‌డ్రైవ్, 4011 పిట్టి కేసులు పరిష్కరించారు. దీంతో పాటు రూ.2,51,275 లక్షలు బాధితులకు చెల్లించేలా ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో జడ్జిలు పి.రవీందర్, హరీష్ బాబు, పొట్ట చెన్నయ్య, బార్ అసోసియేషన్ నాయకులు గాజుల అంజనేయులు, పాల్గొన్నారు.

చదరంగంలో ... దివ్యంగా రాణిస్తూ..

» రాణిస్తున్న అంతర్జాతీయ క్రీడాకారిణి దివ్యశ్రీ
» పట్టణంలో అకాడమీ ఏర్పాటు » హర్షిస్తున్న క్రీడాభిమానులు

ఆటలలో చదరంగానిది ప్రత్యేక స్థానం. కండబలం కాకుండా బుద్ధిబలంతో ఆడే ఆ ఆటకు సుదీర్ఘ చరిత్ర ఉంది. ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులను చిత్తు చేసేందుకు పావులు కదపాలంటే మెదడుకు పదును పెట్టాల్సిందే. అలాంటి ఆటలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారిణి నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన మాశెట్టి దివ్య.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)



ఖేల్

మిర్యాలగూడకు చెందిన మాశెట్టి దివ్య క్రీడాభిమానులకు సుపరిచయం. చిరుప్రాయంలోనే చదరంగం(చెస్)లోకి అడుగిడిన దివ్య జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చూపడంతో పాటు అంతర్జాతీయ స్థాయి చెస్ పోటీలలో అదరగొట్టింది. ఆటపై ఉన్న అభిమానంతో చెస్ అకాడమీ స్థాపించి చిన్నారులకు తర్ఫీదునిస్తోంది. న్యాయశాస్త్రంలో పట్టభద్రురాలైన ఆమె అమెరికా, లండన్, న్యూజిలాండ్ తదితర దేశాలలోని తెలుగు వారికి ఆన్‌లైన్‌లో ఆటలో మెళకువలు నేర్పిస్తోంది. దివ్య శిక్షణ పొందిన ఎన్నారై విద్యార్థులు ఆయా దేశాల్లో నిర్వహిస్తున్న చెస్ పోటీలలో చతురత కనబరుస్తూ పతకాలు సాధిస్తున్నారు.

ఎనిమిదో ఏట నుంచే...

ఎనిమిదో ఏటనే మాశెట్టి దివ్య చెస్‌పై ఆసక్తి పెంచుకుంది. దీంతో ఆమె తల్లిదండ్రులు డైమండ్ శ్రీనివాస్-గీత ప్రోత్సహించారు. 11 ఏళ్ల వయసుకే తొలి టోర్నమెంట్ ఆడిన దివ్య జిల్లా,రాష్ట్ర, జాతీయ స్థాయి పతకాలెన్నో సాధించింది. కఠోర సాధన చేసి ఇంటర్నేషనల్ చెస్ పోటీలకు ఎంపికైంది. ఫిలిపిన్స్, సింగపూర్ దేశాలలో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో తలపడిన దివ్య గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి ఈ తరం క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచింది.

బ్లైండ్ ఫోల్డెడ్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కోసం..

బ్లైండ్ ఫోల్డెడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అనుమతిచ్చింది. అయితే టోర్నమెంట్ నిర్వహణకు సుమారుగా రూ.35 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే స్పాన్సర్స్ ఎవరూ ముందుకు రాకపోవడంతో టోర్నమెంట్ నిర్వహణ వాయిదా వేయాల్సి వస్తోందని దివ్య చెబుతోంది. కొంతమేరకు తాను ఖర్చు భరించగలనని, మిగతా ఖర్చులకు క్రీడాభిమానులు సహకరిస్తే 2024లోనే బ్లైండ్ ఫోల్డెడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తానంటోంది. ఏడాది మారితే దరఖాస్తు ఫీజు తదితర ఖర్చులు అదనంగా ఉంటాయంటున్న దివ్య స్పాన్సర్స్ ప్రయత్నాల్లో ఉంది.

తెలివితో ఆడే ఆటకు చూపుతో పనేముంది?

కంటికి గంతలు కట్టుకుని ఆడే ఆటనే బ్లైండ్ ఫోల్డెడ్ చెస్ పోటీలుగా పిలుస్తారు. బ్లైండ్ ఫోల్డెడ్ చెస్ టోర్నమెంట్‌లో కళ్లకు గంతలు కట్టుకున్న క్రీడాకారులు మాత్రమే ఆడతారు. అయితే దివ్య నిర్వహించాలనుకున్న బ్లైండ్ ఫోల్డెడ్ చెస్ టోర్నమెంట్‌లో కళ్లకు గంతలు కట్టుకున్న క్రీడాకారులతో పాటు నిజమైన అంధులను ఆడించాలనుకుంది. అందుకు తగిన క్రీడాకారులను సైతం ఎంపిక ప్రక్రియలో నిమగ్నమైంది.

పట్టణంలో అకాడమీ ఏర్పాటు..

చెస్‌పై ఉన్న అభిమానంతో దివ్య అకాడమీ స్థాపించింది. నాలుగేళ్ల కిందట రాష్ట్ర రాజధానిలో చెస్‌కు శిక్షణనివ్వడం ఆరంభించిన దివ్యశ్రీ గత నెలలో మిర్యాలగూడలో అకాడమీ ప్రారంభించింది. ఇప్పటికే ఇక్కడ శిక్షణ పొందిన 30 మంది క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇక 200 మంది అంధులకు చెస్‌లో శిక్షణనివ్వడం విశేషం.

అంతర్జాతీయ గుర్తింపుతో

ఆన్‌లైన్లో ప్రత్యేక తరగతులు నేర్పించే దివ్యకు అంతర్జాతీయ గుర్తింపు తెస్తున్న శిష్యులున్నారు. అమెరికాకు చెందిన రియాన్, ధీయా, దేవాన్ష్‌వర్మలు దివ్యశ్రీ శిక్షణలో రాటుదేలి చదరంగంలో రాణిస్తున్నారు. ఆగస్టులో బోస్టన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో రియాన్, ధీయా పాల్గొన్నారు. అక్టోబరులో టెక్సాస్‌లో నిర్వహించిన నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో దేవాన్ష్‌వర్మ సత్తాచాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. న్యూజిలాండ్‌కు చెందిన తమోజ్ఞ అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్నారు.

తనదైన రీతిలో శిక్షణనిస్తూ..

చదరంగ క్రీడను అమితంగా ఇష్టపడే దివ్య నాలుగేళ్ల నుంచి శిక్షణనిస్తోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో ప్ర త్యేక తరగుతులు నిర్వహిస్తూ ఇప్పటివరకూ పెద్దసంఖ్యలో చెస్ క్రీడాకారులను తయారు చేస్తోంది. అందులో అమెరికాకు చెందిన ముగ్గురు చిన్నారులు రియాన్, ధీయా, దేవాన్ష్‌వర్మ ఉండగా, న్యూజిలాండ్‌కు చెందిన మరో విద్యార్థి తమోజ్ఞ చదరంగంలో చక్కని ప్రతిభ చూపుతూ ఆయా దేశాలలో రాణిస్తూ దివ్యకు గుర్తింపు తెస్తున్నారు.

ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చేందుకే..

మిర్యాలగూడకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చేందుకే డైమండ్ చెస్ అకాడమీ స్థాపించా. మన ప్రాంత చిన్నారులు చదరంగంపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. వారి ఆసక్తికి అనుగుణంగా శిక్షణ ఇస్తున్నా. అన్ని ఆటల మాదిరిగా కాకుండా చెస్ అనేక ప్రత్యేకతలు కలిగిఉంది. క్రీడాకారుల్లో మేధస్సు, వ్యూహాత్మకత పెంచుతోంది. అయితే పిన్నవయసులోనే నేర్పిస్తే అద్భుతాలు చేస్తారు. అందుకే శిక్షణ నిచ్చేందుకు ఐదేళ్లలోపు చిన్నారులను ఎంచుకుంటున్నా.

- మాశెట్టి దివ్యశ్రీ, అంతర్జాతీయ క్రీడాకారిణి



చెస్‌లో సత్తా చాటుతూ

ప్రతిభ కనబరుస్తున్న రాడికల్ చెస్ అకాడమీ విద్యార్థులు

అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు

సూర్యాపేటకు చెందిన చంద్రోలు దివ్యభవానీ ఇంటర్ పూర్తిచేసింది. చదరంగంపై ఉన్న మక్కువతో నాలుగేళ్లుగా సూర్యాపేటలోని రాడికల్ చెస్ అకాడమీలో కోచ్ ఎడవెల్లి అనిల్‌కుమార్ వద్ద శిక్షణ పొందుతోంది. ఇప్పటికే ఐదు అంతర్జాతీయ స్థాయి, 20కి పైగా రాష్ట్ర స్థాయి, 56కు పైగా జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. దీంతో పాటు 2022లో మహాబలిపురంలో నిర్వహించిన చెస్ ఒలంపియాడ్ పోటీలను వీక్షించే అవకాశం రాష్ట్రం నుంచి దివ్యభవానీకి మాత్రమే దక్కింది. దీంతో పాటు 2024లో బుధఫెస్ట్ హంగేరిలో నిర్వహించిన అండర్-16 విభాగంలో అన్‌రెడెడ్ ప్రిన్సెస్ ఆఫ్ ది వరల్డ్-2023 అవార్డును ప్రపంచ చెస్ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ నుంచి అందుకుంది. ప్రపంచం నుంచి ఈ పోటీల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. 2023 డిసెంబరులో చెన్నైలో వేలూరులో నిర్వహించిన జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బిహార్ రాష్ట్రం పాట్నాలో నిర్వహించిన నేషనల్ స్కూల్ గేమ్స్‌లో అంతర్జాతీయ ఫీడీ రేటింగ్‌కు అర్హత సాధించింది. జూలైలో విజయవాడలో నిర్వహించిన స్పార్క్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో బెస్ట్ ఫీమేల్ అవార్డును దక్కించుకుంది. జూన్‌లో జమ్ముకాశ్మీర్‌లో ఏఐసీఎఫ్ స్మార్ట్ గర్ల్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని తృతీయ బహుమతి సాధించింది.



సూర్యాపేటకు చెందిన కప్పల ఇందిరాభువనేశ్వరీ రెండేళ్లుగా రాడికల్ చెస్ అకాడమీలో కోచ్ ఎడవెల్లి అనిల్‌కుమార్ వద్ద చెస్‌లో శిక్షణ తీసుకుంటోంది. ప్రస్తుతం స్థానిక త్రివేణి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. చెస్‌పై మక్కువతో ఆ క్రీడలో రాణిస్తోంది. ఇప్పటివరకు రెండు అంతర్జాతీయ స్థాయి, మూడు జాతీయ స్థాయి, 10కి పైగా రాష్ట్ర స్థాయి, 30కి పైగా జిల్లా స్థాయి చదరంగ పోటీల్లో బహుమతులు సాధించింది. 2023లో 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చదరంగ పోటీలకు ఎంపికైంది. ఈ ఏడాది ఫిబ్రవరి లో బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహించిన నేషనల్ స్కూల్ గేమ్స్ చదరంగ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చా టింది. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ చదరంగ పోటీల్లో ప్రతిభ చాటి బహుమతి అందుకుంది. జూన్‌లో అన్‌రెడెడ్ ప్రిన్సెస్ ఆఫ్ ది వర ల్డ్ పోటీల్లో మొదటి బహుమతి సాధించింది. ప్రపంచ చెస్ ఛాంపియన్ సాధించిన గుకేష్ నుంచి ఇందిరా భువనేశ్వరీ అవార్డు అందుకున్నారు.



చదరంగంలో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన చిన్నారులు ప్రతిభ చాటుతున్నారు. కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన రాడికల్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు.

(ఆంధ్రజ్యోతి,సూర్యాపేట (కలెక్టరేట్)

సూర్యాపేటకు గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రయత్నం

చదరంగంలో సూర్యాపేటకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నా. ఆరేళ్లుగా చిన్నారులకు శిక్షణ ఇస్తున్నా. 2022లో రాష్ట్ర చదరంగ సమాఖ్య ద్వారా ఉత్తమ చదరంగ కోచ్ అవార్డును అందుకున్నా. ఇప్పటి వరకు 1000 మంది చిన్నారులకు చదరంగం చేర్పించా. శిక్షణ పొందిన వారిలో కొందరు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయి బహుమతులు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో సూర్యాపేట పేరును ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తా.

- ఎడవెల్లి అనిల్‌కుమార్, కోచ్ రాడికల్ చెస్ అకాడమీ సూర్యాపేట.



వెయిట్ లిఫ్టింగ్‌లో మేటి యశ్వంత్

జాతీయ స్థాయిలో రాణిస్తున్న చిలుకూరు యువకుడు

చిలుకూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన్నవయస్సులోనే వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో జాతీయస్థాయిలో రాణిస్తున్నాడు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రానికి చెందిన యడవెల్లి యశ్వంత్. చిలుకూరు గ్రామానికి చెందిన యశ్వంత్‌కు చిన్నప్పటి నుంచే ఆటలపై ఆసక్తి ఉండడాన్ని గమనించిన తండ్రి పుల్లారావు కుమారుడిని ప్రోత్సహించాడు. 2013లో రాష్ట్రస్థాయి ఎంపికలో భాగంగా సికింద్రాబాద్ హకీంపేట క్రీడా పాఠశాలలో యశ్వంత్ 4వ తరగతిలో ప్రవేశం పొందారు. ఆనాటి నుంచి చదువుతో పాటు క్రీడా పాఠశాలలో వెయిట్‌లిఫ్టింగ్‌లో ప్రత్యేకశిక్షణ తీసుకున్నాడు.



పోటీల్లో భాగంగా బరువులు ఎత్తుతున్న యడవెల్లి యశ్వంత్

2015లో వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 50 కిలోల విభాగంలో 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. 2017లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. 2018 నవంబరులో అస్సాంలో జరిగిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఖేల్ ఇండియా ఇంటర్నేషనల్ గేమ్స్‌కు ఎంపికయ్యాడు. 2021 డిసెంబరులో రాష్ట్రస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో మూడు గోల్డ్ మెడల్స్ సాధించాడు. 2022లో భువనేశ్వర్‌లో జరిగిన 96 కిలోల విభాగంలో నేషనల్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని మొదటి 10 మందిలో ఒకడిగా నిలిచాడు. ఈ ఏడాది జనవరి 2న తమిళనాడులో నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ విభాగంలో 102 కిలోల విభాగంలో 4వ స్థానం సాధించాడు. ఇందుకుగానూ ఖేల్ ఇండియా యూత్ గేమ్స్‌కు యశ్వంత్ ఎంపికచేశారు. డిగ్రీ చదువుతున్న యశ్వంత్ చిన్ననాటి నుంచి ఇప్పటివరకు 15బంగారు పతకాలు, 4 వెండి పతకాలు, కాంస్య పతకం సాధించాడు.

సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలకు సర్వం సిద్ధం

● రేపటి నుంచి 21 వరకు పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానాలు సిద్ధమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా గ్రామీణ, పట్టణ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు గ్రామీణ, మండల, మునిసిపాలిటీ స్థాయిల్లో పలుక్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న జిల్లా స్థాయి సీఎం క్రీడా పోటీలకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియం, ఇండోర్ స్టేడియంతో పాటు మిర్యాలగూడలోని ఎన్ఎస్పీ క్యాంప్ మైదానాన్ని సిద్ధం చేశారు. ఇప్పటికే స్టేడియంలో ఉన్న వసతులను ఉపయోగించి క్రీడాంశాలకు తగినట్లుగా కోర్టులను తయారుచేశారు. ఆయాచోట్ల పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయులను ఆటల పోటీల నిర్వహణకు నియమించారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా స్థాయి క్రీడా పోటీలకు కావాల్సిన సౌకర్యాలను డీఎస్‌డీవో కే నర్సిరెడ్డి కల్పించారు. మండల, మునిసిపాలిటీ స్థాయిలోని వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన బాల , బాలికలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు క్రీడల శాఖ ఆధ్వర్యంలో అన్ని వసతులు కల్పించనున్నారు.



నల్లగొండ పట్టణం మిర్యాలగూడరోడ్డులోని అవుట్‌డోర్ స్టేడియం

క్రీడా పోటీలు ఇవే..

మేకల అభినవ్ స్టేడియంలో ఈ నెల 16న కబడ్డీ పోటీలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదేరోజున మిర్యాలగూడలోని ఎన్ఎస్పీ క్యాంప్‌లో బేస్‌బాల్ పోటీలు, 17వ తేదీన ఖోఖో, బ్యాడ్మింటన్, జూడో పోటీలు మేకల అభినవ్ స్టేడియం, ఇండోర్ స్టేడియంలో జరగనున్నాయి. 18వ తేదీన వాలీబాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తారు. 19వ తేదీన అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, తైక్వాండో పోటీలు జరగనున్నాయి. 20వ తేదీన హాకీ, నెట్‌బాల్, బాస్కెట్‌బాల్, చెస్, యోగ పోటీలు జరుగుతాయి. మేకల అభినవ్ స్టేడియంతో పాటు ఎన్జీ కళాశాల మైదానం, ఇండోర్ స్టేడియాల్లో 21వ తేదీన హాకీ, వాలీబాల్, హ్యాండ్ బాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్(ఉమ్మడి నల్లగొండ జిల్లా) పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలకు సుమారు 1000మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. ఐదు రోజుల పాటు జరిగే క్రీడా పోటీలతో అవుట్ డోర్, ఇండోర్, ఎన్జీ కళాశాల మైదానాలు సందడిగా మారనున్నాయి.

ఏం చదివారు? ఎలా చదువుతున్నారు?

శాలిగౌరారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వల్లాల, అడ్లూరు గ్రామాల్లోని పాఠశాలకు చెందిన పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు శనివారం వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. సుమారు 10 మంది విద్యార్థుల కుటుంబాలతో మాట్లాడారు. విద్యార్థుల చదువు గురించి ఆరా తీశారు. ఇంగ్లీష్ ఉపాధ్యాయులు చిత్తలూరి సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయుడు కుక్కడపు శ్రీనివాస్ పిల్లల విద్యా ప్రమాణాల మీద తల్లిదండ్రులతో చర్చించారు. ఏం చదివారు, ఎలా చదువుతున్నారంటూ తల్లిదండ్రుల ముందే విద్యార్థులతో మాట్లాడారు. శనివారం రోజు సెలవు రోజు అయినప్పటికీ ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, వాళ్ల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లల విద్యపై అవగాహన కల్పించి, ఆదర్శంగా నిలిచారు. సెలవు రోజుల్లోనూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, విద్యార్థుల తల్లిదండ్రులకి, ఉపాధ్యాయులకు మధ్య స్నేహాభావాన్ని పెంపొందిస్తూ, విద్యార్థుల ప్రగతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా బాగుందని పలువురు తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ప్రశంసించారు.



వల్లాలలో విద్యార్థి తండ్రితో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాస్, విద్యార్థినితో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు సత్యనారాయణ

కరాటే, తైక్వాండోలో రాణిస్తున్న చల్లూరు విద్యార్థి

రాజాపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన మాటూరు అక్షజ్‌గౌడ్ కరాటే, తైక్వాండో పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధిస్తూ ఒలంపిక్ పతకమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాడు. ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రెండేసి పతకాలు సాధించారు. తల్లిదండ్రులు మాటూరు శ్రీనివాస్, వర్షితలకు అక్షజ్‌గౌడ్, శివాన్షిగౌడ్, అయాన్ష్‌గౌడ్ ముగ్గురు సంతానం. ఈ ముగ్గురు హైదరాబాద్‌లోని జేఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్నారు. అక్షజ్‌గౌడ్ 6వ తరగతి చదువుతున్నాడు. రెండేళ్ల నుంచి కరాటే, తైక్వాండో, కర్రసాము, ఆటిలరీలో శిక్షణ పొందుతున్నాడు. తల్లిదండ్రులు, కోచ్ శివారెడ్డి ప్రోత్సాహంతో ఆయా క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ పోటీలలో సత్తా చాటుతున్నాడు. కరాటే, తైక్వాండోలో వైట్ బెల్ట్, ఎల్లో బెల్ట్, బ్లూ బెల్ట్, రెడ్‌బెల్ట్‌లతో పాటు బ్లాక్ బెల్ట్ సాధించాడు. కరాటేతో పాటు నాన్‌చాక్, కర్రసాములో పతకాలను సాధిస్తున్నారు. సెప్టెంబరు 14, 15 తేదీల్లో బెంగుళూరులో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో జూనియర్ విభాగంలో రాష్ట్రం నుంచి పాల్గొని బంగారు, కటాస్‌లో వెండి పతకాన్ని సాధించాడు. అదేవిధంగా సెప్టెంబరు 28, 29వ తేదీల్లో గోవాలో జరిగిన అంతర్జాతీయ కరాటే, తైక్వాండో పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. ఒలంపిక్‌లో పతకాన్ని సాధించాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతూ పథకాలను సాధిస్తున్నాడు.



దేశానికి పేరు తీసుకువస్తాం

అమ్మానాన్నల ప్రోత్సాహంతో కోచ్ శివారెడ్డి శిక్షణతో భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధిస్తా. దేశానికి, గ్రామానికి పేరుతెస్తా. ఒలంపిక్ పతకాన్ని సాధించాలనేదే నా లక్ష్యం.

అక్షజ్‌గౌడ్, క్రీడాకారుడు, చల్లూరు.

జాతీయస్థాయి మెడల్ సాధించిన నజియా

చండూరు రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన షేక్ నజియా జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో బిహార్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 32వ జూనియర్ నేషనల్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రం తరుపున పాల్గొన్నారు. ఈ సందర్భంగా చండూరు మండల ఫెన్సింగ్ అకాడమీ వ్యవస్థాపకులు ఎండీ రహమత్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన నజియా జాతీయ స్థాయిలో సిల్వర్‌మెడల్ సాధించడం గర్వకారణమని ఆమెకు అభినందనలు తెలిపారు. నజియా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని బంగారు, వెండి పథకాలు సాధించినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేక నిరుత్సాహపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తే రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తెస్తారని అన్నారు.



సిల్వర్ మెడల్‌తో షేక్ నజియా

అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

● ఎదురెదురుగా ఢీకొన్ని మినీట్రాలీ, టవేరా
● ఇద్దరి దుర్మరణం, ఎనిమిది మందికి తీవ్రగాయాలు

దేవరుప్పుల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లా దేవరుప్పల మండలం మరిపడిగ-చింతబావితండా మధ్యలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తవేరా వాహనం ప్రయాణికులను ఎక్కించుకుని సూర్యాపేట జిల్లా తిరుమలగిరి నుంచి జనగామ వైపు వెళ్తోంది. అదే సమయంలో జనగామ వైపు నుంచి సూర్యాపేట వైపు వస్తున్న మినీ ట్రాలీవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం గ్రామానికి చెందిన మరిపెల్లి యాకయ్య(46), సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలకేంద్రానికి చెందిన సూరనేని సంపత్(55)లు మినీట్రాలీలో కూర్చున్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కాగా, తవేరా వాహనంలో ఉన్న జనగామ మండలం వడ్లకొండకు చెందిన గోనె రాజు, దిలీప్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేష్, సూర్యాపేట జిల్లా, తిరుమలగిరికి చెందిన చిన్నబోయిన యాదగిరి, వటం సత్యనారాయణ, వటం అండాలు విజయవాడకు చెందిన మినీ ట్రాలీ డ్రైవర్ మర్కాపురం రాంబాబులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనం ద్వారా జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరో ప్రైవేటు వాహనంలో మృతదేహాలను మార్చురీకి తరలించారు. ఎదురెదురుగా ఢీ కొన్న వాహనాలను రోడ్డు పక్కకు తొలగించారు. మృతుడు యాకయ్య కుమారుడు మరిపెల్లి బెనహర్ ఫిర్యాదు మేరకు దేవరుప్పుల ఎస్ఐ సృజన్‌కుమార్ కేసు నమోదు చేసుకున్నారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి పంచనామా నిర్వహించారు. కాగా, సూరనేని సంపత్ మృతదేహాన్ని స్వగ్రామం తిరుమలగిరికి తరలించారు.



ప్రమాదంలో నుజ్జయిన తవేరా వాహనం

18న జవహర్ నవోదయ 6వ తరగతికి ప్రవేశ పరీక్ష

పెద్దవూర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయలో 2025-26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశ పరీక్షను ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని చలకుర్తి ప్రిన్సిపాల్ నాగభూషణం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాధికారులతో ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించడం జరుగుతదన్నారు. వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. డౌన్‌లోడ్‌లో ఇబ్బందులు ఉంటే 9448983776 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నరసింహాచారికి జ్యోతిష్య శిరోమణి పురస్కారం

సంస్థాన్‌నారాయణపురం డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలకేంద్రానికి చెందిన ఆందోజు నరసింహాచారి జ్యోతిష్యం శిరోమణి పురస్కారం అవార్డును అందుకున్నారు. గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో మహతి ఆడిటోరియం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జ్యోతిష్య విద్యలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన నరసింహచారికి పురస్కారాలను అందజేశారు. టీటీడీ ప్రధాన అర్చకులకు సంబంధించిన రంగాచారి, టీటీడీ రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో డాక్టర్ నారాయణ, ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో డైరెక్టర్ డాక్టర్ సి.నరసింహ స్వామి, జ్యోతిష్య పండితులు అరుణ్‌మహేష్ నుంచి అవార్డును అందుకున్నారు.

మృతదేహం లభ్యం

వేములపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో ఈ నెల 12న సాగర్ కాల్వలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దామరచర్ల మండలం బొల్లిగుట్టతండాకు చెందిన లావూరి శివ వేములపల్లిలోని సాగర్ ఎడమకాల్వలో దూకినట్లు ఎస్ఐ డీ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతదేహాన్ని సూర్యాపేట జిల్లా పొనుగోడు చెరువులో గుర్తించగా మృతదేహానికి పంచనామా నిర్వహించి మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

(5వ పేజీ తరువాయి)

సమయం ఎక్కువ తీసుకోవడంతోపాటు చిరాకు కలుగుతోందని చెబుతున్నారు. ఇప్పటికీ కొందరు పోస్ట్ ఉమెన్‌లతో అమర్యాదకరంగా ప్రవర్తించే ప్రయత్నం చేయబుతున్నారని, గౌరవించకపోయినా పర్వాలేదు కానీ, చిన్నబుచ్చే ప్రయత్నాలు చేయడం మానుకునేలా అవగాహన కల్పించాలని కోరుతున్నారు. ఒక్కోసారి పార్శిళ్ల బరువు అధికంగా ఉంటుంది. అలాంటప్పుడు వాటిని మోయడం ఇబ్బంది కలుగుతుంది. నిర్ణీత బరువుకంటే ఎక్కువగా పార్సిల్స్ ఉన్నప్పుడు వర్క్‌షేర్ చేసేలా నిబంధనలు సడలించాలని వీరు కోరుతున్నారు. మరోవైపు ప్రతి రోజూ అదనపు సమయం కూడా పనిచేయాల్సి వస్తోందని, దీనికి ఓవర్ టైమ్ పేమెంట్ ఇవ్వాలని కోరుతున్నారు. జాబ్‌చార్ట్ దాటి ఇన్సూరెన్స్‌లు, ఇతరత్రా టాస్క్‌లు కూడా చేస్తున్నామని, వాటి లక్ష్యాని చేరకుంటే తమను ఇబ్బంది పెట్టకుండా ఉన్నతాధికారులు చూడాలని కోరుతున్నారు.

పోస్ట్.. పోస్ట్



తోబుట్టువుల్లా ఆదరిస్తుండడం వల్లే..

నేను రెండేళ్లుగా పోస్ట్‌ఉమెన్‌గా పనిచేస్తున్నా. ఇటు కార్యాలయంలో తోటి సిబ్బంది, అటు ప్రజలు మమ్మల్ని బాగా ఆదరిస్తున్నారు. తోబుట్టువుల్లా పలకరిస్తారు. పనిలో తోడ్పాడునందిస్తుంటారు. ఎండ సమయంలో డెలివరీలకు వెళ్లినప్పుడు పలువురు ఇళ్ల వద్ద మంచినీళ్లు తాగాలని, మరికొందరైతే ఆత్మీయంగా భోజనం చేయాలని, కాసేపు కూర్చోవాలని అనడం ఉత్సాహాన్నిస్తోంది. కుటుంబసభ్యుల మాదిరిగా మద్దతుగా ఉంటున్నారు. ఒక్కోసారి ఎక్కువ పార్శిళ్లున్నప్పుడు ఇంటివెళ్లడం ఆలస్యమవుతోంది. ఇంట్లో కూడా పూర్తి మద్దతు లభిస్తుండటం వల్లే విజయవంతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాం.

పి.కవిత, పోస్ట్‌ఉమెన్, గాంధీనగర్

● కుటుంబ సభ్యుల మద్దతు ఉండటం వల్లే



ఇతర ఉద్యోగాలకంటే కొంత భిన్నమైన పనివిధానం ఈ ఉద్యోగంలో ఉంటుంది. ఇంటింటికీ తిరిగి పోస్టల్ పార్శిళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కోసారి అడ్రస్‌లు దొరక్క ఇబ్బందిపడాల్సి వస్తోంది. అలాంటి సమయాల్లో మహిళలుగా ఇబ్బంది పడుతుంటాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిలో బిజీగా ఉం డాల్సి వస్తున్నా, మా కుటుంబీకులు పూర్తి మద్దతుగా నిలుస్తుండటం వల్లే మేం ఈ వృత్తిలో రాణించగలుగుతున్నాం.ఏరోజు పని ఆ రోజే పూర్తిచేయాల్సి ఉంటుంది. కాబట్టి కొన్ని సందర్భాల్లో సహోద్యోగులు, అధికారులు మాకు అండగా ఉంటుండడంతో ఇబ్బందిలేకుండా పని పూర్తిచేయగలుగుతున్నాం.

ఎం.కవిత, పోస్ట్‌ఉమెన్, శివాజీనగర్, నల్లగొండ

సమన్వయం చేసుకుంటూ



మహిళలమైనప్పటికీ అందరు ఉద్యోగుల్లానే మేం పోస్ట్ ఉమెన్‌గా మా విధులు విజయవంతంగా నిర్వర్తిస్తున్నాం. ఆఫీసు నుంచి ఏ టాస్క్ ఇచ్చినా కష్టపడి, అందరి ప్రోత్సాహం, మద్దతుతో నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేస్తాం. ఏరోజు డెలివరీలు ఆ రోజే వందశాతం ఇచ్చేస్తాం. మహిళలుగా కుటుంబాన్ని ఓవైపు చూసుకుంటూ, మరోవైపు ఉద్యోగం చేస్తున్నాం. రెండువైపులా సమన్వయం చేసుకునే క్రమంలో ఇక్కడ సహోద్యోగులు, అధికారులు సహకరిస్తుంటే, అక్కడ భర్త, పిల్లలు మమ్మల్ని అర్థం చేసుకొని మాకు అండగా ఉంటున్నారు. అందువల్లే భిన్నమైన ఈ ఉద్యోగాన్ని మేం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా చేయగలుగుతున్నాం.

ఆరూరి జానమ్మ, పోస్ట్ ఉమెన్, బోయవాడ, నల్లగొండ

బాగా పనిచేస్తున్నారు



పోస్ట్‌ఉమెన్, జీడీఎస్(ఉమెన్) చాలా బాగా పనిచేస్తున్నారు. రోజువారీ విధుల్లో భాగంగా 100శాతం పోస్టల్ డెలివరీలతో పాటు, డిపార్ట్‌మెంట్ టాస్క్‌లు కూడా నెరవేరుస్తున్నారు. బీమా పాలసీలు, పికప్ సర్వీసులు కూడా నిర్వర్తిస్తున్నారు. నిర్ణీత సమ యం 8గంటలే అయినప్పటికీ పని గంటలతో సంబంధం లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో 15 ఏళ్ల క్రితం కంటే ఇటీవల అమ్మాయిలు ఎక్కువగా జాయినవుతున్నారు. ఇది హర్షించదగ్గ పరిణామం.

ఎర్ర స్వర్ణలత, హెడ్‌పోస్ట్‌మాస్టర్ నల్లగొండ

● కొందరు ఇబ్బంది పెడుతుంటారు



మహిళగా ఉద్యోగాన్ని నిర్వర్తించడంలో ఏనాడూ ఇబ్బంది పడలేదు. పోస్ట్‌మెన్ లాగానే నేను కూడా ఉదయాన్నే వచ్చి పార్శిళ్లు తీసుకొని ఇంటింటికీ వెళ్లి డెలివరీ ఇచ్చి వస్తాం. అయితే పాన్‌కార్డులు, పాస్‌పోర్టుల వంటివి డెలివరీ ఇచ్చినప్పుడు ఎకనాలెడ్జ్‌మెంట్‌పై సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటప్పుడు కొందరు సంతకం పెట్టేది లేదని సతాయిస్తుంటారు. అలాంటప్పుడు వారికి నచ్చజెప్పడం, విషయాన్ని వివరించడం కొంతఇబ్బందిగా ఉంటోంది. వందశాతం పనిపూర్తయ్యాకే విధులు ముగిస్తాం.

కొలని కవిత, పోస్ట్ ఉమెన్, నల్లగొండ

కొత్తలో వింతగా చూసేవారు



నేను 2010లో పోస్ట్‌ఉమెన్‌గా విధుల్లో చేరా.అప్పట్లో నేను ఒక్కదాన్నే మహిళను. మిగతా అందరూ పురుషులే. పోస్టుడెలవరీకి వెళ్లినప్పుడు నన్ను విచిత్రంగా చూసేవారు. మా కొలీగ్స్, అధికారులు మాత్రం బాగా సపోర్టివ్‌గా ఉండేవారు. అప్పట్లో మహిళలు ఈ ప్రొఫెషన్‌లోకి రావాలంటే కొంత జంకేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. పురుషులతో సమానంగా మహిళలు ఇప్పుడు రాణిస్తున్నారు. ఇప్పుడు బైక్స్, మోపెడ్స్ అందుబాటులో ఉన్నాయి. అప్పట్లో నేను సైకిల్‌పై, లేకపోతే నడిచివెళ్లి డెలివరీలు ఇచ్చేదాన్ని. అందరి మద్దతు వల్లే హెడ్‌పోస్ట్ ఉమెన్‌గా పనిచేస్తున్నా.

గాదెపాక భాగ్యమ్మ, హెడ్ పోస్ట్‌ఉమెన్, నల్లగొండ

మహిళతో ఖాకీ..

వివాహేతర సంబంధం?

- తన భార్యతో వివాహేతర సంబంధం నడుపుతూ తమ సంసారంలో చిచ్చుపెట్టాడని భర్త ఆవేదన
- భార్య, ఆ పోలీస్‌తో ప్రాణహాని ఉందని ఎస్పీకి ఫిర్యాదు చేసిన భర్త
- వాట్సాప్ ఛాటింగ్‌లను పసిగట్టి విషయాన్ని గ్రహించానంటోన్న భర్త
- న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు

నల్లగొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖాకీ నడుపుతున్న అక్రమ సంబంధంతో ఆ కుటుంబంలో చిచ్చురేగింది. ఇద్దరు పిల్లలున్న యువతితో సదరు పోలీస్ అధికారి రహస్యసంబంధం నడుపుతున్న విషయాన్ని పసిగట్టిన భర్త ఆధారాలు సహా సేకరించి జిల్లా పోలీస్‌బాస్‌కి సదరు ఖాకీపై ఫిర్యాదు చేయడంతో విషయం రచ్చకెక్కింది. వివరాల్లోకి వెళితే నల్లగొండ జిల్లాకు చెందిన ఒక పోలీస్ సీఐ పెళ్లయి, ఇద్దరు పిల్లలున్న యువతితో రహస్యసంబంధం నడుపుతూ ఆమె భర్తని వేధింపులకు లోను చేస్తున్నారని, అతడికి సంబంధించి భూమి విక్రయించి భార్యకు ఇవ్వాలని హెచ్చరిస్తున్నారని పేర్కొంటూ ఆమె భర్త ఇటీవల జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్‌కి ఫిర్యాదుచేశారు. తన భార్యని ట్రాప్‌లోకి దింపిన సదరు సీఐ తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకొని తమ కుటుంబంలో చిచ్చురేపారని ఆమె భర్త పేర్కొంటున్నారు. తన భార్యతో సదరు సీఐ అసహజమైన, వివాహేతర సంబంధాన్ని రుజువు చేసేలా వాట్సాప్ చాటింగ్ చేశారని, అతడి ప్రోత్సాహం తోనే తన భార్య తనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఆమె భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. త న స్వగ్రామంలో తన తల్లిపేరున ఉన్న భూమిని విక్రయించి తన భార్యకు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని, తన భార్య, సీఐ ఇద్దరు కలిసి తనపై కుట్రపన్నారని, తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని భర్త ఫిర్యాదులో ఆధారాలతో పేర్కొనడం పోలీస్‌వర్గాల్లోనూ సంచలనం రేకెత్తించింది.

ప్రేమించి మరీ వివాహం చేసుకున్న దంపతులు

జిల్లాకే చెందిన ఈ దంపతులు పద్నాలుగేళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. పట్టణంలో చిరువ్యాపారం చేసుకుంటూ, ఇద్దరు పిల్లలతో సంతోషంగా జీవిస్తున్నారు. ఆమె పేరున రెండెకరాల భూమిని కొనడంతో పాటు, ఇళ్ల స్థలమూ కొన్నారు. ఎంతో అన్యోన్యంగా కాలం గడుపుతున్న క్రమంలోనే సొంతూర్లో ఉన్న రెండెకరాల భూమిని విక్రయించి, కొంత బ్యాంకు రుణం తీసుకొని జిల్లాకేంద్రంలో ఇల్లు కట్టుకున్నారు. దీంతో కొంత అప్పులపాలవడం, చేసే వ్యాపారంతో ఇల్లు గడవడం, పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు పెరగడంతో అప్పు తీర్చే మార్గం లేక భార్యాభర్తలిద్దరూ కలిసి నిర్ణయించుకొనే ఇంటిని విక్రయించారు. బ్యాంకులో అప్పు తీర్చారు. బ్యాంకులో క్లియరెన్స్ కోసం బైక్‌పై భార్యాభర్తలిద్దరూ వెళ్లే క్రమంలో ఉన్నట్లుండి భార్య పోలీస్ స్టేషన్‌లోకి వెళ్లి భర్తపై ఫిర్యాదు చేసింది. అప్పటివరకు ఎలాంటి చర్చ లేకుండా ఏకపక్షంగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తాను ఖంగు తిన్నానని, ఎందుకిలా చేస్తుందో అర్థంకాలేదని భర్త పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు తర్వాత విక్రయించిన ఇంటిని కూడా క్యాన్సిల్ చేసేలా కొన్నవారిపై సీఐ ఒత్తిడి తెచ్చారని, దీంతో వారికి ఇంటిని హ్యాండోవర్ చేయలేకపోయామని భర్త పేర్కొన్నారు. ఇంటిని కొనే నిమిత్తం వారిచ్చిన డబ్బుని తన సొంతూర్లో తల్లిపేరున ఉన్న భూమిని విక్రయించి తెచ్చి చెల్లించమని సీఐ బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. తన భార్య ఎందుకిలా ప్రవర్తిస్తుందనే దానిపై తాను విచారణ జరపగా, ఆమెతో సీఐ వివాహేతర సంబంధం నడుపుతున్న విషయం తనకు తెలిసిందని, తన భార్య ఫోన్ ద్వారా చేసిన వాట్సాప్ ఛాటింగ్‌తో వారిద్దరి సంబంధం రుజువు చేసుకున్నానని పేర్కొన్నారు.

తనభార్యచేత ఉద్దేశ్యపూర్వకంగా ఇప్పించిన ఫిర్యాదు ఆధారం చేసుకొని సదరు సీఐ తనని పదేపదే స్టేషన్‌కి పిలిపించి, సొంతూర్లో తన తల్లి పేరున ఉన్న భూమి విక్రయించి డబ్బులు తెచ్చి, ఇంటిని విక్రయించిన వారికి ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని, అలా చేస్తేనే కేసు తొలగించి, భార్య నుంచి విడాకులిప్పిస్తానని బెదిరిస్తున్నారని భర్త పేర్కొంటున్నారు. తన ఇంట్లోకి తాను వెళ్లే పరిస్థితి లేకుండా చేసి మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు సీఐ తన భార్యని ట్రాప్ చేశారని, ఆమెకు ప్లాట్ ఇప్పిస్తానని, డబ్బులిస్తానని, పెళ్లి చేసుకుంటానని సదరు సీఐ మభ్యపెట్టి పచ్చటి తమసంసారంలో చిచ్చుపెట్టారని ఆమె భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భార్య, సీఐ నుంచి తనకు ప్రాణహాని ఉందని, న్యాయం చేయాలని నేరుగా ఎస్పీకి ఫిర్యాదుచేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే అతడి భార్య కూడా తన భర్త తనని నమ్మించి ప్రేమవివాహం చేసుకొన్నారని, ఆ తర్వాత వేధింపులకు లోనుచేస్తున్నారని పేర్కొంటూ ఫిర్యాదు చేయడంతో పోలీస్ ఉన్నతాధికారులు ఈ కేసుపై లోతుగా అన్ని కోణాల్లో విచారణ జరుపుతుండడంతో పోలీస్‌వర్గాల్లోనూ ఈ వ్యవహారంపై చర్చ కొనసాగుతోంది.

విచారణకు ఆదేశించాం, నివేదిక వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటాం

ఒక సీఐపై ఆరోపణలతో మాకు ఫిర్యాదు వచ్చింది. దీనిపై ఇప్పటికే డీఎస్పీచేత విచారణ జరిపిస్తున్నాం. అన్నికోణాల్లో విచారణ జరిపించాక వచ్చిన నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

శరత్‌చంద్రపవార్, ఎస్పీ నల్లగొండ

కొత్తబస్సులతో ఆర్టీసీ సేవలు మెరుగు



జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం లేకుండా గ్రామాల్లో కొత్త బస్సులతో ఆర్టీసీ సేవలు మరింతగా మెరుగు పడనున్నాయని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో కొత్తగా ఆరు బస్సులను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించి, కొంత దూరం బస్సును నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లకాలంగా నియోజకవర్గంలో రవాణా సౌకర్యం లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సౌకర్యం ఉన్నా గ్రామాలకు కాదు, మండలాల వారీగా బస్సు సర్వీసులు నడుపకపోవటం సరికాదన్నారు. గ్రామాల్లో ప్రతి నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి సంబంధిత మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి వెంటనే కొత్తగా ఆరు కొత్త బస్సులను మంజూరు చేశారన్నారు. నియోజకవర్గ ప్రజల తరుపున ఆయనకు ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఆర్టీసీ బస్సుల సర్వీసులను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. గ్రామాల్లో కొత్తగా నడిపే బస్సు సర్వీసులు ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండనుందన్నారు. ప్రభుత్వం అమలు చేసే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఈప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనం కానుందన్నారు. ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఆ సంస్థ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి, జిల్లా ఆర్‌ఎం శివశంకర్, డిపో మేనేజర్ శ్రీనాథ్, ఎస్‌ఐ ఇరుగు రవి, నియోజకవర్గ పరిధిలోని మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రయాణికులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సి నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అసోసియేషన్ నల్లగొండ తాలూకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో వారు మాట్లాడుతూ పెన్షనర్స్‌కు నగదు రహిత వైద్యం, పీఆర్‌సీ వంటి అపరిష్కృత సమస్యలను పరిష్కారించాలని కోరారు. పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా క్యాష్‌లెస్ వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. నూతన ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి వెంటనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో సకాలంలో బకాయిలు వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం 30 మంది పెన్షనర్ల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమావేశంలో సంఘం నాయకులు సుధాకర్, శేషారెడ్డి, రంగయ్య, రామలింగం, కృష్ణయ్య, రమేష్, ప్రసాద్‌రావు, చక్రపాణి, బాలరాజు, బిక్షం, హుస్సేన్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రంలో అగ్నిప్రమాదం



ఆలేరు పత్తి కొనుగోలు కేంద్రంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



దగ్ధమైన పత్తి

ఆలేరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణ పరిధిలోని రాఘునాథ్‌పూర్ మార్గమధ్యలో ఉన్న శ్రీమల్లిఖార్జున కాటన్ ఇండస్ట్రీలో శనివారం అగ్నిపమాదం చోటుచేకుంది. ఇండస్ట్రీలోని గోదాం బయట ఉన్న పత్తి నుంచి ఒక్కసారిగా పొగలు రావడాన్ని గమనించిన సిబ్బంది వెంటనే యజమాని అయిన ఇల్లందుల మల్లేష్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన అగ్నిమాపక కేంద్రానికి ఫోన్‌చేయగా, విషయాన్ని తెలిసిన ఫైర్‌ఇంజన్ సిబ్బంది హుటాహుటిన కొనుగోలు కేంద్రానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ లోగా సుమారు 3వేల క్వింటాళ్ల మేర పత్తి దగ్ధమైందని పరిశ్రమ యజమాని తెలిపారు. సుమారు రూ.2కోట్ల మేర నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రజనీకర్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుమలగిరి, డిసెంబరు 14: జనగామ జిల్లా దేవరుప్పల మండలం చింతబావితండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుమలగిరి మునిసిపాలిటీకి చెందిన వస్త్రవ్యాపారి సూరినేని సంపత్(50) మృత్యువాతపడ్డాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సంపత్ శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి కారులో తిరుమలగిరి వస్తుండగా చింతబావితండా వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరు మృత్యువాతపడగా, అందులో ఒకరు దేవరుప్పల మండలానికి చెందిన వ్యక్తి, మరొకరు సూరినేని సంపత్ గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో మరో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన మునిసిపల్ కేంద్రానికి చెందిన దంపతులు వాటం సత్యనారాయణ అండాలు హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

తుంగతుర్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో శనివారం జరిగింది. బంధువుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తునం అంజయ్య (36) కొన్ని సంవత్సరాలుగా భార్యపిల్లలతో హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. అక్కడే ఇల్లు కూడా కట్టుకున్నాడు. ఇటీవల అప్పులతోపాటు కుటుంబ కలహాలు తోడు కావడంతో తన స్వగ్రామమైన గొట్టిపర్తి గ్రామానికి వచ్చి వ్యవసాయ పొలాన్ని విక్రయానికి పెట్టాడు. వ్యవసాయ పొలాన్ని కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో అప్పుల బాధతో వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అంజయ్యకు భార్య, పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏటీఎం పగలగొట్టి చోరీ: రూ.22లక్షలు అపహరణ



నగదు చోరీకి గురైన ఏటీఎం

దామరచర్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం పగులగొట్టి అందులోని రూ.22లక్షలను దొంగలు అపహరించారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున 3.30గంటల సమయంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏటీఎం సెంటర్‌లో గుర్తు తెలియని దొంగలు కారులో గ్యాస్ కట్టర్లను తీసుకొని వచ్చి చొరబడ్డారు. తొలుత ముసుగు ధరించిన ఓ దొంగ సీసీ కెమెరాపై నలుపురంగు స్ప్రే చేశాడు. అనంతరం మరికొంతమంది కలిసి ఏటీఎంలోకి ప్రవేశించి షట్టర్‌ను కిందకు దింపి గ్యాస్ కట్టర్‌తో నగదును నిల్వ ఉంచే ప్రాంతాన్ని కట్ చేశారు. అందులోని నగదును చాకచక్యంగా ఎత్తుకెళ్లారు. ఈ ఏటీఎంను ముంబైకు చెందిన ఫైనాన్స్ అండ్ సాఫ్ట్‌వేర్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నిర్వహిస్తోంది. ఈ ఘటన 3.30గంటలకు జరగగా, 4.20గంటలకు స్థానిక పోలీసులకు నిర్వహణ సంస్థ సమాచారం అందించింది. సాంకేతిక లోపంతో అలారం ఆలస్యంగా మోగినట్టు పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే దొంగలు నగదుతో అక్కడి నుంచి ఉడాయించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ శనివారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఆధారాల కోసం అన్వేషిస్తున్నారు. ఈ చోరీ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకొని ప్రత్యేక బృందాలతో దర్యాప్తును ముమ్మరం చేశారు.

ఉపాధి హామీ ఉద్యోగి అనుమానాస్పద మృతి

చిట్యాల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి చిట్యాల శివారులో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని రైల్వేస్టేషన్, 65వ నెంబర్ జాతీయ రహదారి మధ్య ఉన్న పొలాల్లో శనివారం ఉదయం ఒక వ్యక్తి మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. అతడి ప్యాంటు జేబులో ఉన్న ఐడెంటిటీ కార్డు ద్వారా మృతుడి వివరాలు తెలుసుకున్నారు. నల్లగొండ జిల్లా కేతేపల్లికి చెందిన శ్రీనివాస వరప్రసాద్ (59)గా పోలీసులు గుర్తించారు. అతడు పదేళ్ల క్రితమే నల్లగొండలో కుటుంబం సహా స్థిరపడ్డారు. ఆయన జగిత్యాలలో ఉపాధిహామీ పథకంలో జూనియర్ క్వాలిటీ కంట్రోలర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన ఈ మధ్య కాలంలో విధులకు కూడా సరిగా హాజరుకావడం లేదని తెలిసింది. ఈ నెల 13వ తేదీన ఇంటికి వచ్చిన ఆయన కేతేపల్లికి వెళ్లి కౌలు డబ్బులు తీసుకువస్తానని భార్యకు చెప్పి వెళ్లిన చిట్యాల శివారులో విగతజీవిగా పడి ఉన్నాడు. సంఘటనా స్థలంలో మృతుడి గొంతు కోసి ఉండటం, హత్య ప్రదేశంలో కత్తి, పురుగుల మందు డబ్బా ఉండటం హత్యా, ఆత్మహత్యా అని అనుమానాస్పదంగా కనిపిస్తోంది. సంఘటనా స్థలాన్ని సీఐ నాగరాజు, ఎస్‌ఐ ధర్మా పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా శ్రీనివాస వరప్రసాద్‌కు ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. వారి పెళ్లిళ్లకు అయిన ఖర్చుతో పాటు ఆయన ముగ్గురు పిల్లల చదువుల కోసం అప్పులు కావడంతో మనస్తాపానికి గురైన ఆయన పురుగుల మందు తాగడంతో పాటు గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని భార్య రుక్మిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మా తెలిపారు. శ్రీనివాసవరప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒకరు కుమారుడు ఉన్నారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల సందడి

● *నృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు*



యాదగిరిగుట్ట ప్రధానాలయం ఉభయ క్యూలైన్లల్లో బారులు తీరిన భక్తులు

భువనగిరి అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో యాదగిరికొండపై శనివారం సందడి నెలకొంది. ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాల్లో రావడంతో కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశం వాహనాలతో నిండిపోయింది. వైకుంఠద్వారం ఇరువైపులా వాహనాలు నిలిపారు. సుమారు 36వేల మంది భక్తులు క్షేత్ర సందర్శనకు వచ్చారు. ఉభయ క్యూలైన్లు భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు బారులు తీరారు. ప్రత్యేక దర్శనానికి అర్ధగంట, ఉచిత దర్శనాలకు గంట సమయం పట్టినట్టు భక్తులు తెలిపారు. ప్రధానాలయం, కల్యాణోత్సవం, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాల కూడా భక్తులతో రద్దీగా మారగా, ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. భక్తులను కొండపైకి, కిందకు తరలించేందుకు అధికారులు తగిన ఏర్పాటు చేశారు.

హరిహరులకు నిత్య పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.40,59,794 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారి ఆలయంలో వైభవంగా తిరుప్పాణియాళ్వార్ తిరునక్షత్రోత్సవాలు కొనసాగాయి. ఉదయం ప్రబంధ అధ్యయనాలతో సేవాకాలం చేపట్టిన పండితులు సంధ్యావేళ ఆళ్వార్ సేవతో తిరువీధిలో పొరప్పాటు నిర్వహించారు.

ఫోన్ చూస్తోందని విద్యార్థినిని కొట్టిన అధికారి

భానుపురి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ చూస్తుందని విద్యార్థినిపై బీసీ సంక్షేమ శాఖ అధికారి చేయి చేసుకున్న ఘటన సూర్యాపేట బీసీ బాలికల సంక్షేమ వసతి గృహంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. వసతిగృహాన్ని బీసీ సంక్షేమ అధికారి అనసూయ ఆకస్మిక తనిఖీచేపట్టారు. అదేసమయంలో పారామెడికల్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మొబైల్ చూస్తున్న విషయాన్ని గమనించి అక్కడికి వెళ్లి అడిగారు. విద్యార్థిని చేతిలో ఉన్న మొబైల్‌ను చేతిలోంచి లాక్కొని ఆమెపై చేయిచేసుకున్నారు. శనివారం ఉదయం ఎస్ఎఫ్ఐ, బీసీ సంఘం, పీడీఎస్‌యూ, టీఎస్పీ సంఘాల నాయకులు వసతి గృహం వద్ద ఆందోళన చేపట్టడంతో జిల్లా అధికారి హుటాహుటిన అక్కడికి చేరుకుని విద్యార్థినికి క్షమాపణ చెప్పడంతోపాటు ఆందోళన విరమించారు. వివిధ సంఘాల నాయకులు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, వీరబోయిన లింగయ్యయాదవ్, భారీ అశోక్‌యాదవ్, వినోద్‌కుమార్, పిడమర్తి భరత్, పోలోజ్ మహేష్, బయ్యు రాజేష్ తదితరులున్నారు.

పత్తిమిల్లులో బేళ్లు మీదపడి..

నాగారం, డిసెంబరు 14: జీవనోపాదికోసం మధ్యప్రదేశ్ నుంచి వచ్చి పత్తిమిల్లులో పని చేస్తున్న కార్మికుడు కట్టినానక్ రామ్(26) జిన్నింగ్ మిల్లులో పత్తి బేళ్ల మీద పడి మృతిచెందారు. నాగారం ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖండువా జిల్లా పంధాన్ గ్రామానికి చెందిన నానక్‌రామ్, అతని భార్య ప్రమీలభాయ్ నెల క్రితం మండలపరిధిలోని శ్రీ శ్రీనివాస కాటన్ మిల్లులో పనిలో చేరారు. పత్తిమిల్లు ఆవరణలో నిద్రిస్తున్న సమయంలో నానక్‌రామ్‌పై బేళ్లు మీదపడి అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తిపన్ను వసూళ్లపై నజర్!

నల్లగొండ మునిసిపాలిటీలో ఆస్తి పన్నులు అధిక మొత్తంలో పేరుకుపోయాయి. పట్టణంలో 48 వార్డులు ఉండగా, రెసిడెన్షియల్ 3594, కమర్షియల్ 3494, రెండు కలిపి ఉన్నవి 2456, మొత్తంగా 41,934 గృహాలు ఉన్నాయి. అయితే వీటి నుంచి రావాల్సిన ఆస్తి పన్ను రుపేనా రావాల్సిన బకాయిలు పెద్ద ఎత్తున ఉన్నాయి. పాత బకాయిలు, ఈ సంవత్సరం బకాయిలు కలుపుకుంటే రూ.48.27 కోట్లు రావాల్సి ఉండగా ఇందులో ఇప్పటివరకు రూ. 10.24కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇందులో పాతబకాయిలే రూ.32 కోట్లు ఉండటం గమనార్హం.

- (రామగిరి, ఆంధ్రజ్యోతి)



- రూ.48 కోట్లపైగా పేరుకుపోయిన బకాయిలు
- ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సింది రూ.13 కోట్ల పైమాటే
- వసూళ్లే లక్ష్యంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు

ఆస్తి పన్ను వసూళ్లే లక్ష్యంగా మునిసిపల్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. 48 వార్డులకు గాను 12 వార్డులకు ఒక బృందం చొప్పున 4 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందంలో ఏసీపీ, డీఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, ఫిట్టర్, కమ్యూనిటీ ఆర్గనైజర్ (సీవో), ఆర్‌పి, జవాన్ ఉండనున్నారు. వీరు ప్రతీ రోజూ 3 నుంచి 4 వార్డులు పర్యటించి టాప్ 10లో ఉన్న బకాయిదారులను గుర్తించి మొదటిగా రెడ్ నోటీస్‌తో హెచ్చరికలు జారీ చేస్తారు. వారం రోజుల్లోగా స్పందించి ఆస్తి పన్ను చెల్లించకపోతే మునిసిపల్ చట్టం సెక్షన్ 85, 86, 87, 100 (2) ప్రకారం వారి నల్లా కలెక్షన్లు కట్ చేయడంతో పాటు వారి ఆస్తులను కూడా జప్తు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తుంది.

ప్రభుత్వ కార్యాలయాల బకాయి రూ.13 కోట్ల పైమాటే

ఇదిలా ఉండగా పట్టణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.13 కోట్ల పైచిలుకు ఆస్తి పన్ను రావాల్సి ఉంది. ఇందులో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు 96 ఉండగా వాటి నుంచి రూ. 2.25 కోట్లు ఉండగా, వసూళ్లు ఏ మాత్రం కాలేదు.

ఇకపోతే రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు 302 ఉండగా వాటి నుంచి రూ. 10.87 కోట్లు రావాల్సి ఉండగా, రూ. 6.5 లక్షల పైచిలుకు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ. 10.80 కోట్ల పైచిలుకు రావాల్సి ఉంది. మొత్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ 398 కార్యాలయల నుంచి రూ. 13.11 కోట్లు రావాల్సి ఉండగా కేవలం రూ. 6.5 లక్షలు మాత్రమే వసూళ్లు అయ్యాయి. ఇక 13 కోట్ల పైచిలుకు రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా జిల్లా జైలు కార్యాలయం, వైద్య ఆరోగ్యశాఖ, పోస్టల్ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, మండల ఆఫీస్, పశుపోషణ వంటి ప్రభుత్వ కార్యాలయాలు రూ. 1 కోటి రూపాయిల బకాయిల చొప్పున టాప్ 10లో నిలవడం గమనార్హం.


వసూళ్లకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం



పేరుకుపోయిన బకాయిలను వసూళ్లు చేసేందుకు 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. టాప్ 10లో ఉన్న బకాయిదాలకు ఇప్పటికే రెడ్ నోటీస్‌ను అందజేశాం. ఆస్తి పన్ను చెల్లించకపోతే అవసరమైతే ఆస్తులను సీజ్ చేస్తాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

ఆస్తి పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి



ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి. ఆఫీస్‌లో సిబ్బంది కొరత ఉండటం వల్ల వసూళ్లు పెద్దగా కాలేకపోయాయి. ఆస్తి పన్ను వసూళ్లే లక్ష్యంగా ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశాం. దీంతో పాటు ఈ మధ్యకాలంలోనే వార్డు ఆఫీసర్లు కూడా రాబోతున్నారు. వారు వచ్చిన ఫిట్టర్లు, ఆపరేటర్లతో కలిసి వసూళ్లపై దృష్టి సారిస్తారు. దీంతో ఎన్ని ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఉన్నాయి, ఎన్ని ఇళ్లకు అసెస్‌మెంట్ జరిగింది అనే విషయం కూడా తేటతెల్లం కానుంది.

- బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్

జాగ్రత్తలు పాటించాలి

కట్టంగూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉందని, బాలికలు చలికాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈవో అంబటి అంజయ్య సూచించారు. కట్టంగూరులోని కేజీబీవీ పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లను బాలికలకు అందజేశారు. విద్యార్థులకు అన్ని వేడిగా ఉన్న ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. ప్రభుత్వ బాలికల విద్యాలయంలో చదివే బాలికల కోసం ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.



బాలికలకు దుప్పట్లు అందజేస్తున్న ఎంఈవో

ఆర్‌ఎంపీలపై దాడులను నివారించాలి

● గవర్నర్‌కు ఆర్‌ఎంపీల సంఘం విజ్ఞప్తి



గౌవర్నర్ కలిసిన ఆర్‌ఎంపీ సంఘాల నాయకులు

నల్లగొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలల్లో ఆర్‌ఎంపీలపై టీఎస్‌ఎంసీ(తెలంగాణ మెడికల్ కౌన్సిల్) దాడిని నివారించాలని స్మృఖత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర గౌవర్నర్ విష్ణుదేవ వర్మకు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని, శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్‌ఎంపీల సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నేతి రాజేశ్వర్ రావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పొనుగోటి హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరాజు, డీఎస్‌ఎన్ చారి, వెంకటేశ్వర్లు, రాజశేఖర్ రావు, యాదగిరి, కృష్ణారెడ్డి, లింగరాజు, కిరణ్, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీవో, తహసీల్దార్

తిప్పర్తి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాలలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామని ఎంపీడీవో ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం తిప్పర్తి మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను తహసీల్దార్ డి.స్వప్నతో కలిసి వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాలను పరిశీలించిన అనంతరం అక్కడి సమస్యలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన వసతి, సదుపాయాలు సరైన రీతిలో ఉన్నప్పటికీ మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లకు తలుపులు, నీటి కులాయిలు సరిగ్గా లేవని వాటికి మరమ్మతులు చేయించాలని విద్యార్థులు తెలిపారని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పాల్గొన్నారు.

మెరుగైన గురుకుల విద్యార్థి ఆరోగ్యం

కేతేపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూసీ గురుకుల పాఠశాల విద్యార్థి నీలం సాయిగణేష్ ఆరోగ్యం మరింత మెరుగుపడింది. పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి నీలం సాయిగణేష్ వాష్‌రూంకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో కాలు నుంచి రక్తం వస్తుండడంతో పాము కరిచిందనే అనుమానంతో రెండు రోజుల నుంచి హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్న విషయం విదితమే. శుక్రవారం రోజంతా ఐసీయూలో ఉంచి వైద్య అందించిన ఆసుపత్రి వైద్యులు శనివారం సాయిగణేష్ ఆరోగ్యం మెరుగుపడడంతో జనరల్ వార్డుకు మార్చారు. మరో రెండు రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని ఆసుపత్రి వైద్యులు సూచించనట్లు సాయిగణేష్ బంధువులు తెలిపారు. ఆసుపత్రిలో సాయిగణేష్ వద్ద మూసీ గురుకుల పాఠశాల ఏఎన్‌ఎం ప్రబంధ, సాయిగణేష్ నాయనమ్మ, మేనబావ బంటు శివలు ఉంటున్నారు.

మాల మహానాడు నూతన కమిటీ

శాలిగౌరారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం చిత్తలూరు మాల మహానాడు గ్రామశాఖ అధ్యక్షుడిగా పీర్నాయకం నరేష్, ఉపాధ్యక్షుడిగా పీర్నాయకం వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా అల్లె రాములు, కోశాధికారిగా ముల్క రాజు, గౌరవాధ్యక్షులుగా సిలువేరు జానయ్య, పీర్నాయకం రామచంద్రు ఎన్నికయ్యారు. మాల సింహగర్జనను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

గోపలాయపల్లిపై ఘనంగా సుదర్శన హోమం

నార్కట్‌పల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిహర క్షేత్రం గోపలాయపల్లి శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానంలో శనివారం సుదర్శన హోమాన్ని ఘనంగా నిర్వహించారు. రోహిణీ నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతీ నెలా విశ్వశాంతిని కోరుతూ సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్నారు. పలువురు దంపతులు హోమ యజ్ఞం వద్ద పూజల్లో కూర్చున్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ ఉత్సవంలో ఆలయ అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16నుంచి వేణుగోపాల స్వామి ఆలయంలో ఉత్సవాలు

కనగల్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కనగల్ గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 13 వరకు ధనుర్మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు అక్కినేపల్లి శ్రీనివాస్‌రావు, తిరుమలనాధ్ వంశ పారంపర్య అర్చకులు నర్సింహాచార్యులు, భాస్కరాచార్యులు, వెంకటాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా జనవరి 10న ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు, 11న కూడార్తై ఉత్సవం, 13న గోపాలస్వామి గోదాల తిరుకళ్యాణోత్సవం జరుగునని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగు అందజేత

శాలిగౌరారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మార్కెట్‌లో రోడ్డు వెంట గోడదాటి బాలరాజు, తోట అంజయ్య కలిసి ఇడ్లీ బండి నడుపుతున్నారు. ఇడ్లీ బండి వద్ద తినే వారికి నీడ లేకపోవడంతో వారి సౌకర్యం కోసం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగును క్లబ్ అధ్యక్షుడు డెంకల సత్యనారాయణ, చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి వడ్లకొండ బిక్షం, సభ్యులు దామెర్ల శ్రీనివాస్, దునక వెంకన్న తదితరులు ఉన్నారు. ఇడ్లీ బండి వద్ద నీడకోసం గొడుగును అందజేసిన లయన్స్ క్లబ్ వారికి బాలరాజు, అంజయ్య కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నార్కట్‌పల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం పెట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. జిల్లాలోని పలు గురుకుల పాఠశాలలు, కాలేజీలు, వసతి గృహాల్లో కామన్ మెనూ ప్రోగ్రాం నిర్వహించారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమా న్ని ప్రారంభించారు. ఉత్సాహభరితంగా విద్యార్థులు తమ తల్లి దండ్రులతో కలిసి నూతన మెనూ భోజనాన్ని ఆస్వాదించారు. శనివారం నార్కట్‌పల్లిలోని ఎంజేపీ బీసీ గురుకుల బాలుర పాఠశాలలో కామన్ డైట్ ప్రోగ్రాంను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటైన సమావేశంలో ఆ యన మాట్లాడారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో ఫుడ్ కమిటీలకన్నా ఫుడ్ సేఫ్టీ కమిటీల పాత్రే అతి ముఖ్యమని అన్నారు. వండటానికి ముందు నిత్యావసర వస్తువుల నాణ్యతను, వండిన తర్వాత భోజన రుచిని ఫుడ్ కమిటీలు స్వయంగా పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం సూచించిన మెనూను తప్పనిసరిగా అమలుచేయాలని ఆదేశించారు. వి ద్యతో పాటు ఇతర అన్ని విభాగాల్లోనూ గురుకుల విద్యార్థులు రాణించ డం అభినందనీయమన్నారు. ప్రభుత్వం యంగ్ ఇండియా ప్రాజెక్టు పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పాఠశాలల్లో ఐఐటీ, నీట్ వంటి కోర్సులను అభ్యసించేలా ఉన్నత ప్రమాణాలతో కూడిన వనరులు, బోధనలో నైపుణ్యం గలిగిన అధ్యాపక బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి చరిత, డీటీ రామకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ చేపూరి వెంకటేశం, ఏటీపీ రేణుక, వార్డెన్ శ్రీలత, ప్రత్యేకాధికారి చరిత, తహసీల్దార్‌లు ఎల్.వెంకటేశ్వర్‌రావు, ప్రసాద్, ఎంపీడీవో ఉమేశ్‌చారి, ఎంపీవో సుధాకర్, ఎంఈవో నర్సింహ, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

● నకిరేకల్, కేతేపల్లి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన డైట్ చార్జీలు 40శాతం, కాస్మెటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో నకిరేకల్ పట్టణంలోని ఎస్‌ఎల్‌బీసీలోని గురుకుల బాలికల పాఠశాల, కేతేపల్లి మండలంలో బొప్పారం గ్రామ పరిధిలో గల మూసీ బీసీ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. డైట్, కాస్మెటిక్ మెనూను ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఉన్న గురుకుల పాఠశాలల్లో కామన్‌మెనూ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నేటి పిల్లలను రేపటి భావి భారతపౌరులుగా తీర్చి దిద్దటమే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేశారు కానీ వసతులు కల్పించలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచిందని న్నారు. ఆయా కార్యక్రమాల్లో సోషల్ వెల్ఫేర్ జిల్లా సూపరింటెండెంట్ శ్రీధర్, పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ సుకన్య, సీనియర్ అధ్యాపకులు కందుకూరి యాదయ్య, మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంఈవో ఎ.రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ పి.ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి: కామన్ డైట్ చార్ట్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

● కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం నూతన కామన్ మెనూను ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అన్నారు. మెనూ చార్జీలు పెంచడం, ఎంతోమంది పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించవచ్చని అన్నారు. దీంతో పాటు విద్య, ఆరోగ్యం కూడా ఎంతో మెరుగుపడుతుందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అంబటి శంకర్‌కుమార్, కార్యదర్శి అనిల్‌కుమార్, డిప్యూటీ వార్డెన్ జయమ్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మర్రిగూడ, నాంపల్లి: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మర్రిగూడ, నాంపల్లి మండలాల ప్రత్యేక అధికారులు వేణుగోపాల్, శ్రీనివాసులు అన్నారు. రెండు మండలాలలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలుర వసతిగృహాల్లో కామన్ మెనూను వారు ప్రారంభించి మాట్లాడారు. హాస్టల్‌లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచి వారికి నాణ్యమైన ఆహారం అందించడానికి కృషి చేస్తుందని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మర్రిగూడ, నాంపల్లి ఎంపీడీవోలు మున్నయ్య స్వర్ణమేరి కుమారి, తహసీల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీవో ఝాన్సీ రెడ్డి, హాస్టల్ వార్డెన్‌లు ర మేష్, లింగస్వామి, శ్రీనివాస్ పలువురు ఉన్నారు.

● చండూరు మండలంలోని బోడంగిపర్తి గ్రామంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలను వ్యవసాయ అధికారి పద్మజ పరిశీలించారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలో, వసతి గృహాల్లో విద్యని అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన బోజనం అందించాలని అన్నారు. పాఠశాలలోని స్టోర్ రూమ్, వంటశాల, మరుగుడొడ్లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, మంచికంటి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చండూరులోని బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ కామన్‌మెనూ ప్రారంభించారు. పిల్లలను పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ భారతమ్మ పాల్గొన్నారు.

● శాలిగౌరారంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో మండల ప్రత్యేకాధికారి బి.మన్యా నాయక్ నూతన మెనూను ప్రారంభించారు. పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, కాస్మెటిక్ చార్జీలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంఈవో మందుల సైదులు, ఎంపీవో పద్మ, రామదాసు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



మూసీ గురుకుల పాఠశాలలో నూతన డైట్, మెనూ చార్జీల చార్టును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

ఎస్‌ఎస్‌ఏలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



సమ్మెలో పాల్గొని మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండటౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపిన ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది ఉద్యోగులు ఐదు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుందని ఆయన ప్రశ్నించారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్ష రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులను రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాత పరీక్ష ద్వారా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీతో ఇంటర్వ్యూలో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశారు. వివిధ స్థాయిల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. 18 సంవత్సరాల నుంచి సర్వ శిక్ష ఉద్యోగులు పాఠశాల విద్య అభివృద్ధి కోసం వారి నైపుణ్యాన్ని, కృషిని అందిస్తున్నారని పేర్కొన్నారు. వారిలో చాలామంది ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబానికి చెందినవారేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ. 10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు సౌకర్యం కల్పించాలని, పదవీ విరమణ చేస్తున్న వారికి రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ. 25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హన్మకొండ సభలో ఇచ్చిన హామీ ప్రకారం సర్వ శిక్ష ఉద్యోగులను వెంటనే రెగ్యులైజేషన్‌కు కావాల్సిన చర్యలను చేపట్టాలని అనేక మార్లు ముఖ్యమంత్రిని వివిధ రాష్ట్ర, జిల్లా అధికారులకు విన్నవించినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదని అన్నారు. ఫలితం రాకపోవడంతో డిసెంబరు 10 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని రాతపూర్వకంగా సమ్మె నోటీస్ ఇచ్చినా ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సమ్మెలోకి వెళ్లామని తక్షణమే ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో సమ్మె మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వారు చేస్తున్న పోరాటానికి సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మెలుగురి కృష్ణ, ప్రధాన కార్యదర్శి బొమ్మగాని రాజు, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, సీఐటీయూ జిల్లా నాయకులు పి.సత్యనారాయణ వివిధ కేటగిరిల ఉద్యోగ, కార్మికులు పాల్గొన్నారు.

లోకరక్షకుడిగా వచ్చిన ఏసుక్రీస్తు

మర్రిగూడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చీకటిలోనూ మరణ ఛాయలోను కూర్చుండు వారికి వెలిగినిచ్చేది ఏసుక్రీస్తేనని క్రైస్తవ మర్రిగూడ మండల పాస్టర్‌ల సంఘం శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెబ్రోన్ సంఘం ఆధ్వర్యంలో రాంరెడ్డిపల్లి, సరంపేట గ్రామాలల్లో క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రధాన కూడలి వద్ద ఏసుక్రీస్తు జననం గురించి సువార్త ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవం అంటే మతం కాదని, కులం కాదని మారుమనస్సు పొంది శాంతిమార్గంలో నడవడమే ఏసుక్రీస్తు ఆకాంక్ష అని ఆయన అన్నారు. ప్రజలు చెడు మార్గంను విడిచి శాంతి మార్గంలో నడిచినప్పుడు పరలోకం చేరుతారని వారు బోధించారు. ఈ కార్యక్రమంలో హెబ్రోన్ సంఘం చర్చి పాస్టర్ ఆర్నాల్డ్, అబ్రహాం, యాదగిరి, శ్రీనివాస్, శేఖర్, మంజుల, పాస్టర్లు పాల్గొన్నారు.

మాలధారులకు ముస్లింల అన్నదానం

మునుగోడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి మాల ధరించిన పలువురికి అన్నదానం చేయించిన ముస్లింలు మతసామరస్యాన్ని చాటుకున్నారు. మునుగోడు మండల కేంద్రంలో మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండీ. అన్వర్ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు శనివారం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కులమత బేధాలు లేకుండా అందరం కలిసి ఉండాలన్న ఉద్దేశంతో తాను ఈకార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్వాయి జితేందర్‌రెడ్డి, చెరుకుపల్లి వెంకటేశం, జాల వెంకన్న పాల్గొన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న ముస్లిం సోదరులు

రేపటి నుంచి ధనుర్మాసోత్సవాలు

ముస్తాబైన నల్లగొండ రామాలయం

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాలకు జిల్లా కేంద్రంలోని రామగిరి సీతారామచంద్రస్వామి దేవాలయం ముస్తాబైయింది. నెల రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పిస్తున్నారు. ప్రతీ రోజు సాయంత్రం ఆలయంలో ధనుర్మాస తిరుప్పావైను భాష్యం జగన్నాధచార్యులు ప్రవచించనున్నారు. నెల రోజుల పాటు కొనసాగే ఉత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది.

ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతాయి. ఈనెల 21న తొండర డిప్పోడి ఆల్వార్ తిరునక్షత్రం, జనవరి 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ఉత్తరద్వార దర్శనం, జనవరి 1న ఆంగ్ల నూతన సంవత్సరం వేడుకలు, జనవరి 11న కుడార్తై ఉత్సవం, 13న నీరాటోత్సవం, సాయంత్రం స్వామివారి ఎదుర్కోలు, గోదారంగమన్నార్ తిరు కల్యాణ మహోత్సవం, 14న పవళింపు సేవ నిర్వహించనున్నారు.



ధనుర్మాస ఉత్సవాలకు ముస్తాబైన రామాలయం

అదేవిధంగా ఈనెల 22న శ్రీకృష్ణ వేష ధారణ పోటీలు, 29న అండాల్ అమ్మవారి వేషధారణ పోటీలు, జనవరి 5న ముగ్గుల పోటీలు, సాయంత్రం తిరుప్పావై అనుసంధాన పోటీలు నిర్వహించనున్నారు. దీంతో పాటు 20 గోదారంగనాయక స్వామి వారి సహస్ర నామార్చన. 24 ఆంజనేయ స్వామి వారి సహస్ర నామార్చన, 28న లక్ష్మీవేంకటేశ్వర స్వామి సహస్రనామార్చన, జనవరి 2న భగవత్ రామానుజాచార్య వారి సహస్రనామార్చన, 5న సీతారామచంద్రస్వామి వారి సహస్రనామార్చన పూజలు నిర్వహించనున్నారు.

నిత్య పూజలు

రామగిరి ఆలయంలో తెల్లవారుజామున 4గంటలకు సుప్రభాతం, ఆరగింపు, 6.30 గంటలకు ఆధ్యాత్మిక ప్రవచనం, 7.30గంటలకు అర్చనలు, సాయంత్రం 5.30గంటలకు వికాస తరంగిణి భక్తుల సామూహిక విష్ణు సహస్ర పారాయణం, 6గంటలకు భాష జగన్నాథ చార్యులు, స్థానాచార్యులు రామ రంగాచార్యుల స్వామి నేతృత్వంలో తిరుప్పావై ప్రవచనాలు, 7గంటలకు అమ్మవారి పల్లకి సేవ, 8 గంటలకు ఆరగింపు, ప్రసాద వినియోగం చేయనున్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.128	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.120	180	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 18.0

పోస్ట్..పోస్ట్



- ఈ రంగంలోనూ రాణిస్తున్న మహిళలు
- ఓ వైపు ఇంటి పనులు.. మరోవైపు విధులు
- ఆటంకాలెదురవుతున్నా ఆత్మస్థైర్యంతో ముందుకు
- ప్రశంసలు అందుకుంటున్న పోస్ట్ ఉమెన్‌లు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

వృత్తి ఏదైనా పురుషులకు ధీటుగా మహిళలు రాణిస్తున్నారు. భిన్నమైన పనివిధానమైనా మెరుగైన విధులు నిర్వహిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు మహిళా పోస్టల్ ఉద్యోగులు. పోస్ట్ ఉమెన్‌గా, గ్రామీణ డాక్ సేవక్‌లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 100 మందికిపైగా మహిళలు పనిచేస్తూ సత్తా చాటుతున్నారు. ఓ వైపు గృహిణిగా ఇంటిని చూసుకుంటూనే మరోవైపు ఉద్యోగ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. పని చేసే క్రమంలో ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదురవుతున్నా చిరునవ్వుతో సమాధానమిస్తూ ముందుకెళ్తున్నారు. సైకిళ్లపై, బైక్‌లపై రయ్...రయ్‌మని వెళ్తూ విజయవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. సహోద్యోగులు, అధికారుల ప్రశంసలతో పాటు, ప్రజల మన్ననలు పొందుతూ నేటి యువతులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న మహిళా పోస్ట్ ఉమెన్‌లపై ప్రత్యేక కథనం.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

పోస్ట్ ఉమెన్, గ్రామీణ డాక్‌సేవక్ మిగతా ఉద్యోగాల్లా ఉండదు. పనివేళలు మొదలు, పని విధానం వరకు అన్నీ భిన్నంగానే ఉంటాయి. ఇతర ఉద్యోగుల్లా కుర్చీలో కూర్చొని చేసే ఉద్యోగం కాదు. కార్మికుల్లా ఎండైనా, వానైనా, చలైనా వెరకవకుండా పార్సిళ్ల బ్యాగులను మెడకు వేసుకొని ఇంటింటికీ తిరిగి అందజేయాల్సి ఉంటుంది. తెల్లవారుజామునే లేచి ఇంట్లో పనులు పూర్తిచేసుకొని, యూనిఫామ్ వేసుకొని సైకిల్‌పైనో, స్కూటీపైనో 8గంటలకు పోస్టాఫీసుకు చేరుకుంటారు. అక్కడ అధికారులు, సూపర్‌వైజర్ల నేతృత్వంలో సార్టింగ్ పూర్తయ్యాక బ్యాగులను, పార్సిళ్లను తీసుకొని అడ్రసుల జాబితా వెంటపెట్టుకొని వెళ్తారు. అడ్రస్ దొరక్కపోతే ఫోన్లు చేసి కనుక్కోవాలి. ఫోన్లో మాట్లాడే వారి భాష అర్థం కాకపోతే పక్కనున్న ఇంకొకరితో మాట్లాడించాలి. అంతేకాదు, కొందరు ఇచ్చిన అడ్రస్ సరిపోలకపోతే ఆ పార్సిల్‌ను మరోసారి క్రాస్ చెక్ చేసే బాధ్యత వీరిదే. పనిచేసే క్రమంలో కొన్నిచోట్ల మద్దతు, ఆదరణ లభిస్తుంటే, మరికొన్ని చోట్ల మహిళలనే చులకన భావన, చిన్న చూపును వీరు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ అధిగమిస్తూ విధి నిర్వహణలో ముందుకెళ్తున్నారు. పేరుకు 8గంటల డ్యూటీ అయినా ఒక్కో రోజు 10 నుంచి 12గంటల వరకు సైతం పనిచేయాల్సి వస్తుంది. డ్యూటీ చార్ట్ ప్రకారం కేవలం పోస్ట్ ఉమెన్‌గా విధులేగాక, అదనంగా పోస్టల్‌శాఖ ఇటీవల చేపట్టిన ఇన్సూరెన్స్ పాలసీలు, డిపాజిట్లసేకరణ, పలు రకాల స్కీముల నిర్వహణ చేస్తూ అదనపు టాస్క్‌లను కూడా విజయవంతంగా పూర్తిచేస్తున్నారు. పురుష ఉద్యోగులకు ధీటుగా వృత్తిలో రాణిస్తూ ఈ పోస్ట్ ఉమెన్‌లు ఆదర్శంగా నిలుస్తున్నారు.

క్షేత్రస్థాయిలో ఎన్నో సమస్యలు

పోస్ట్ ఉమెన్ క్షేత్రస్థాయిలో పార్సిళ్ల డెలివరీ ఇచ్చేందుకు వెళ్లినప్పుడు పలు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లేఖలు మొదలు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, ఇంటర్వ్యూ లెటర్లు, పాన్‌కార్డులు, ఆధార్ కార్డులు, పాస్‌పోర్టులతో పాటు మరోవైపు పుస్తకాలు, రకరకాల పార్సిళ్లు పోస్టు ద్వారా వస్తే వాటిని సదరు అడ్రస్‌లో డెలివరీ ఇవ్వాల్సి ఉంటుంది. పోస్టల్‌శాఖ నిబంధనల ప్రకారం కొన్నింటికి ఎలాంటి అకనాలెడ్జ్‌మెంట్ అవసరం లేకుండా డెలివరీ ఇస్తే సరిపోతుంది. మరికొన్నింటికి మాత్రం డెలివరీ తీసుకున్నట్టు సంతకం తీసుకోవాల్సి ఉంటుంది. అలాంటి సందర్భాల్లో నిబంధనలు తెలిసిన వారు సంతకం పెడుతుంటే, మరికొందరు మాత్రం సంతకం చేసేదిలేదని మొండికేస్తున్నారు. దీంతో ఇబ్బందులుపడుతున్నామని పోస్టల్ ఉమెన్‌లు పేర్కొంటున్నారు. ప్రధానంగా అడ్రస్ దొరక్కపోతే, వారి ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి, వారిని వెతికి పట్టుకొని ఇవ్వాల్సి వస్తోందని, ఇలాంటి సమయంలో తమ బీట్ పరిధి దాటి వెళ్లాల్సి వస్తుండటంతో సమయం ఎక్కువ పడుతోందని చెబుతున్నారు. లీగల్ నోటీసులు, బ్యాంకు నోటీసుల వంటివి వచ్చినప్పుడు కొందరు వాటిని చదివాక రిసీవ్ చేసుకుంటామని సతాయిస్తున్నారని, ఇలాంటి సందర్భాల్లో ఇబ్బంది ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. మరికొందరు ఇళ్లలోనే ఉండి కూడా తాము లేమని చెబుతుంటారని, ఆ లేఖ లేక నోటీస్ వారిది కాదని పేర్కొంటుంటారని, ఇలాంటి సమయాల్లో...

- మిగతా 7వ పేజీలో...

మనవాళ్లూ మెరికలే..

చెక్ క్రీడలో రాణిస్తున్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



పిన్న వయసులో దొమ్మరాజు గుకేష్ 64 గళ్ల సామ్రాజ్యంలో విశ్వవిజేతగా నిలిచి చరిత్ర సృష్టించాడు. తెలుగు మూలాలున్న గుకేష్ చెస్ ప్రపంచానికి రారాజుగా నిలిచి ఎందరికో ఆదర్శగా మారాడు. మన ఉమ్మడి జిల్లాకు చెందిన ఎందరో చెస్ క్రీడలో రాణిస్తున్నారు. మిర్యాలగూడకు చెందిన మాశెట్టి దివ్య క్రీడాభిమానులకు సుపరిచయం. చిరుప్రాయంలోనే చదరంగం(చెస్)లోకి అడుగిడిన దివ్య జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ చూపడంతో పాటు అంతర్జాతీయ స్థాయి చెస్ పోటీల్లో అదరగొట్టింది. మిర్యాలగూడకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చేందుకే డైమండ్ చెస్ అకాడమీ స్థాపించి తెలుగు వారికి ఆన్‌లైన్‌లో ఆటలో మెళకువలు నేర్పిస్తోంది. బ్లైండ్ ఫోల్డెడ్ చెస్ టోర్నమెంట్ నిర్వహించేందుకు దరఖాస్తు చేసుకున్న దివ్యకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అనుమతిచ్చింది. సూర్యాపేటకు చెందిన చంద్రోలు దివ్యభవానీ ఇప్పటికే ఐదు అంతర్జాతీయ స్థాయి, 20కి పైగా రాష్ట్ర స్థాయి, 56కు పైగా జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. ఈ ఏడాది బుద్ధ ఫెస్ట్ హంగేరిలో నిర్వహించిన అండర్-16 విభాగంలో అన్‌రెడెడ్ ప్రిన్సెస్ ఆఫ్ ది వరల్డ్-2023 అవార్డును ప్రపంచ చెస్ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ నుంచి అందుకుంది. సూర్యాపేటకే చెందిన కప్పల ఇందిరా భువనేశ్వరి ఇప్పటివరకు రెండు అంతర్జాతీయ స్థాయి, మూడు జాతీయ స్థాయి, 10కి పైగా రాష్ట్ర స్థాయి, 30కి పైగా జిల్లా స్థాయి చదరంగ పోటీల్లో బహుమతులు సాధించింది. 6

మహిళతో ఖాకీ
వివాహేతర సంబంధం?

భార్య, అతడితో ప్రాణహాని ఉందని ఎస్పీకి ఫిర్యాదు చేసిన భర్త



నల్లగొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఆ పోలీస్ అక్రమ సంబంధంతో తమ కుటుంబంలో వివాదం చెలరేగిందని అతడి భర్త జిల్లా పోలీస్‌బాస్‌కు ఫిర్యాదు చేశాడు. పెళ్లయిన ఓ సీఐ, ఇద్దరు పిల్లలున్న తన భార్యతో రహస్య సంబంధం నడుపుతున్నాడని అతడు ఆరోపిస్తున్నాడు. అంతేగాక వారిద్దను తనను వేధిస్తున్నారని, భూమి విక్రయించి డబ్బు ఇవ్వాలని హెచ్చరిస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదుచేశాడు. అంతేగాక వారిద్దరి నుంచి తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని వేడుకోవడం పోలీస్‌వర్గాల్లో సంచలనం రేకెత్తించింది. ఈ ఘటనపై ఎస్పీ శరత్‌చంద్ర పవార్ డీఎస్పీ ద్వారా విచారణ చేయిస్తున్నారు. 7

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలి

ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ డిప్యూటీ కార్యదర్శి భవేశ్ మిశ్రా



బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

నల్లగొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలతో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ డిప్యూటీ కార్యదర్శి భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గంధంవారి గూడెం ఎస్సీ బాలికల గురుకులంలో డైట్ కామన్ మెనూను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా డైట్ చార్జీలు, 16 ఏళ్లుగా కాస్మెటిక్ చార్జీలు పెంచకపోవడంతో ఇబ్బందులెదురయ్యాయని, ఇకపై ఆ సమస్య తీరుతుందన్నారు. అన్ని రెసిడెన్షియల్స్‌లో డైట్ చార్జీలు 40శాతం, కాస్మెటిక్ చార్జీలను 200శాతం ప్రభుత్వం పెంచిందన్నారు. పాఠశాలలు, గురుకులాల్లో భోజనం తయారీ, నాణ్యత పరిశీలనకు ప్రభుత్వం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికలతో ఆయన ముచ్చటించారు. వారితో కలిసి ప్రార్థన చేశారు. ఏ సమస్య ఉన్నా తనకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మెనూను పక్కాగా అమలు చేయాలి : కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, మునుగోడు): ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందజేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. శనివారం మునుగోడులోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో కామన్ డైట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడిన పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డైట్ మెనూ అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ప్రతీ పాఠశాలలో ఆహార భద్రత కమిటీ ఏర్పాటుచేసి నిరంతరం భోజనాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి ఉంచాలని, ప్రతీ విద్యార్థి ఆరోగ్య ప్రొఫైల్‌ను పర్యవేక్షించాలన్నారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే బాధ్యత ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులదేన్నారు. తొలుత కలెక్టర్‌కు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో డీపీవో, మండల ప్రత్యేకాధికారి మురళీ, ఎంపీడీవో విజయ్ భాస్కర్, గురుకుల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

చదువులతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ : ఎస్పీ

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ టౌన్): ప్రభుత్వం విద్యార్థుల చదువులతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతోందని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. శనివారం పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో కామన్ డైట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం స్టోర్ రూమ్, కిచెన్‌ను, పరిసరాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్‌బీ సీఐ రాఘవరావు, టూటౌన్ సీఐ డానియల్, తదితరులు ఉన్నారు.

నేడు, రేపు గ్రూపు-2 పరీక్షలు

నల్లగొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో జిల్లాలో గ్రూపు-2 పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 29,118 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు నల్లగొండలో 59 కేంద్రాలు, మిర్యాలగూడ పట్టణంలో 28 కేంద్రాలు ఏర్పాటు చేశారు. నల్లగొండలో 21,777మంది అభ్యర్థులు, మిర్యాలగూడలో 7,941మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు ముగ్గురు రీజనల్ కోఆర్డినేటర్లు, 99మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 31మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 17మంది జాయింట్ రూట్ ఆఫీసర్లు, 244మంది ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లను నియమించారు. గ్రూపు-2 పరీక్ష కేంద్రం ఉన్న అన్ని పాఠశాలలకు రెండు రోజులు సెలవు ప్రకటించారు. పరీక్షలు ఉదయం 10 నుంచి 12.30గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహించనున్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా
ముందుకు సాగాలి

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ముందుకుసాగాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి గండి వీరేందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊరికి ఒకరు కలిసి వస్తే రాష్ట్రంలో, దేశంలో రాజకీయ పార్టీలకు బీసీలపై అనివార్యత సృష్టిస్తామని, ఇంటికొకరు కలిసి వస్తే రాజ్యాధికారాన్ని అట్టడుగు వర్గాల చేతిలో బహుమతిగా అందిస్తామని అన్నారు. అట్టడుగు వర్గాలు పోరాడకపోవడం వల్లే అగ్రవర్ణాల ఆజమాయిషీ కొనసాగుతోందన్నారు. అధికారం కోసం బీసీలు తిరగబడితే అనివార్యంగా వారు కుర్చీలు ఖాళీ చేసే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఉపకరించేలా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. యువత, మహిళలు రాజకీయాల్లోకి రావాలన్నారు. బీసీల నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ అన్ని జిల్లాల్లో నాయకత్వ నిర్మాణాన్ని చేపట్టామని, యువ నాయకులను, మహిళలను ప్రోత్సహిస్తూ వారిని స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలుపుతామన్నారు. బహుజన ముక్తి పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు దాసు రామ్‌నాయక్ మాట్లాడుతూ, ఎటువంటి ప్రాతిపదిక లేకుండా అశాస్త్రీయంగా, అన్యాయంగా పార్లమెంటులో అగ్రవర్ణ ఆధిపత్య పార్టీల ఆమోదంతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు దొడ్డిదారిన ప్రవేశపెట్టారన్నారు. దీంతో నేడు అట్టడుగు వర్గాలకు విద్య, ఉద్యోగ అవకాశాలు తగ్గి యువత నైరాశంలోకి వెళ్తోందన్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జెల్ల మార్కెండేయ మాట్లాడుతూ, బీసీల ఓట్లు బయటికి వెళ్లకుండా కట్టడిచేసేలా వ్యూహాలను రచిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్నాటి యాదగిరి, లింగం చిరంజీవి, బొంగు ప్రసాద్, నూనె వెంకటస్వామి, తండు సైదులుగౌడ్, రఫీ, పంతులు, మధుబాబు, పున్న పవన్‌కుమార్, మారంశీను, దాశరాజు జయరాజు, దొంత ఆనందం, మదత కిశోర్, భారత మురళీధర్, భండారి పద్మావతి, అచ్చ నాగమణి, జంగోని స్వరూప, కుమార్‌గౌడ్, పెద్దగాని కుమారస్వామి యాదవ్, గంజి నాగరాజు, రమేష్, శంకర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు
విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్



నల్లగొండ అగ్రోస్ లిమిటెడ్ దుకాణంలో తనిఖీలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ, డిసెంబరు 14:(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని మల్లికార్జున అగ్రోకెమికల్స్, నల్లగొండ అగ్రోస్ లిమిటెడ్, మిర్యాలగూడ రైతుమిత్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేసి శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన, కంపెనీ ఎరువులనే విక్రయించాలన్నారు. డీఏపీ, యూరియా ధర కంటే తక్కువకు లభించే నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గత సీజన్ కంటే యాసంగిలో మరో 20వేల ఎకరాల్లో అదనంగా పంటలు సాగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు విత్తనాలను, ఎరువులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మునుగోడు ఏడీఏ వేణుగోపాల్, కేతేపల్లి ఏవో పురుషోత్తం, మిర్యాలగూడ ఏవో సైదానాయక్, ఏఈవో షఫీ, తదితరులు పాల్గొన్నారు.

22న ఆదర్శ రైతులకు పుడమిపుత్ర అవార్డులు

నల్లగొండ కల్చరల్, డిసెంబరు 14: యాదగిరిగుట్టలో ఈనెల 22న నిర్వహించే రైతు సదస్సులో రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న 115మంది ఆదర్శ రైతులకు పుడమిపుత్ర అవార్డులను అందజేయనున్నట్టు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, రైతు సదస్సు కన్వీనర్ పడమటి పావని తెలిపారు. శనివారం నల్లగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అదేవిధంగా శాస్త్రవేత్తలకు కిసాన్ సేవా రత్న అవార్డులు అందజేస్తామన్నారు. ఈ సదస్సులో రైతుల ఉత్పత్తులను ప్రదర్శిస్తామని, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కోసం ఒక అడుగు పొడవు ఉన్న 500 గాంధీ విగ్రహాలను ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో నాయకులు మెరుగు మధు, బొమ్మపాల గిరిబాబు, అశోక్, అనిత, బాలరాజు, పాముల అశోక్, అజీజ్, జ్యోతి, వెంకట్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

సత్వర న్యాయం కోసమే లోక్ అదాలత్ ఏర్పాటు

జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సత్వర న్యాయ సహాయం కోసమే లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని న్యాయ సేవా సదన్ భవనంలో లోక్ అదాలత్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా అమూల్యమైన కాలాన్ని కాపాడుకోవడమే కాకుండా ప్రశాంత జీవనం సాగించవచ్చని అన్నారు. అనంతరం వివిధ కేసులను ఇతర న్యాయమూర్తులతో కలిసి పరిష్కరించారు. లోక్ అదాలత్‌లో 72 సివిల్ కేసులు, 4,787 క్రిమినల్ కేసులు, 86 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 9 బ్యాంక్ కేసులు, 15 సైబర్ క్రైం కేసులు, 230 విద్యుత్‌శాఖ కేసులు, 9,251 ట్రాఫిక్ చలానా కేసులు, మొత్తం 44,358 పెండింగ్, ప్రీ లిటికేషన్ కేసులను పరిష్కరించారు. ప్రమాద బీమా కేసుల్లో 4,09,38,000 నష్ట పరిహారాన్ని ఇప్పించగా, బ్యాంకు కేసులకు సంబంధించి రూ.3,55,000 రుణ పరిహారం ఇప్పించారు. దీంతో పాటు క్రైం కేసుల్లో రూ.1,14,385 రికవరీ చేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి తేజో కార్తీక్, న్యాయమూర్తులు దుర్గ ప్రసాద్, కవిత, శిరీష, సౌందర్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, లింగయ్య, మాతంగి వీరబాబు, సింగపంగ జంగయ్య, పాల్గొన్నారు.

పెండింగ్ కేసులకు పరిష్కారం

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ లీగల్): పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతాయని న్యాయ సేవా సంస్థ చైర్మన్, ఐదో అదనపు జిల్లా జడ్జి జి.వేణు అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన లోక్‌అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బత్తుల సుజయ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సుమబాల, స్పెషల్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీదేవి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సకినాల వేలాద్రి, ఏజీపీ గోదాల వెంకట్‌రెడ్డి, ఏపీపీ కళ, తదితరులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 118 కేసులను పరిష్కరించి, మోటార్ యాక్సిడెంట్ కేసుల్లో రూ.32,05,760 బాధితులకు చెల్లించేలా ఆదేశించారు.

(ఆంధ్రజ్యోతి, దేవరకొండ): దేవరకొండలో అదాలత్‌లో ఏడు సివిల్, 110 క్రిమినల్, 49 ఎక్సైజ్, 212 డ్రంకెన్‌డ్రైవ్, 4011 పిట్టి కేసులు పరిష్కరించారు. దీంతో పాటు రూ.2,51,275 లక్షలు బాధితులకు చెల్లించేలా ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో జడ్జిలు పి.రవీందర్, హరీష్ బాబు, పొట్ట చెన్నయ్య, బార్ అసోసియేషన్ నాయకులు గాజుల అంజనేయులు, పాల్గొన్నారు.

మెస్‌చార్జీలు విడుదల చేయాలి

కొండమల్లేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో మెస్ చార్జీలు పెంచామని చెబుతున్న ప్రభుత్వం మెస్ బకాయిలను ఎందుకు విడుదల చేయడం లేదని ఆయన ప్రశ్నించారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి కృషి

చింతపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప ఆలయ నిర్మాణానికి తన వంతుగా కృషి చేస్తానని ఆలయ కమిటీ చైర్మన్ వూరె లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని వెంకటేశ్వర నగర్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం నిర్వహించిన అయ్యప్ప భక్తులు చేపట్టిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంట్లో అయ్యప్ప శరణుఘోష సంకీర్తన చేయడం వల్ల కష్టాలు తొలిగి సంపద లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు మల్లోజు జగదీష్, ఇడుకుల్ల భారత్, కిరణ్, శ్రీకాంత్, శివ, అశోక్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా కూరగాయల మార్కెట్

కొండమల్లేపల్లిలో నిర్మించిన కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారింది. మేజర్ గ్రామపంచాయతీగా కొండమల్లేపల్లి పేరుగాంచింది. అంతేకాకుండా ప్రధాన వాణిజ్య కేంద్రంగా నిలిచింది. నిత్యం రద్దీగా ఉండే కొండమల్లేపల్లిలో రోడ్లపై కూరగాయల వ్యాపారంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.50 లక్షలతో నిర్మించిన కూరగాయల మార్కెట్ సరైన నిర్వహణకు తోడు అవగాహన కొరవడటంతో నిరుపయోగంగా మారింది.
- కొండమల్లేపల్లి

▸▸ రూ.50లక్షలతో ఏర్పాటు ▸▸ వినియోగించడంలో విఫలం




నిరుపయోగంగా కూరగాయల మార్కెట్

కొండమల్లేపల్లిలో కూరగాయల వ్యాపారుల కారణంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవు తుంది. దీంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు, రోడ్లపై కూరగాయల వ్యాపారాలను ఒక దగ్గరికి తీసుకువచ్చేందుకు తీసుకొచ్చే ఉద్దేశంతో ఐదేళ్ల క్రితం హైదరాబాద్ రోడ్డులో కూరగాయల మార్కెట్‌ను నిర్మించారు. దీంతో అప్పటి మంత్రి జగదీ‌ష్‌రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చిరు వ్యాపారాల నిర్వహణతో ట్రాఫిక్ సమస్య, ప్రమాదాల నివారణకు ఈ మార్కెట్ ఉపయోగపడుతుందని భావించినా కూరగాయల వ్యాపారుల మధ్య పోటీతత్వం, కూరగాయల వ్యాపారులు ఏకతాటిపైకి రాకపోవడంతో కూరగాయల మార్కెట్‌కు వచ్చేందుకు పెద్దగా ఆసక్తి కనబరచలేదు. దీంతో యథావిధిగా తమతమ రహదారికి ఇరువైపులా కూరగాయల వ్యాపారా లు, చిరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. సొంత అడ్డ కలిగిన వ్యాపారులు కూరగాయల మార్కెట్‌కు వచ్చేందుకు విముఖత చూపడం, కూరగాయల మార్కెట్‌లోకి వచ్చిన వారికి సరైన గిరాకీ లు లేకపోవడం తదితర కారణాలతో మార్కెట్ యార్డు నిరుపయోగంగా మారింది.

చుట్టు పక్కల మండలాల నుంచి వ్యాపారం

గుర్రంపోడు, నాంపల్లి, పీఏపల్లి మండాల నుంచి అధిక సంఖ్యలో కొండమల్లేపల్లికి వ్యాపారం నిమిత్తం వస్తుంటారు. రైతులు తమ ఉత్పత్తులను కొండమల్లేపల్లికి ఉదయం 3 గంటలకే తీసుకొచ్చి రోడ్ల పక్కనే విక్రయాలు చేస్తుంటారు. మార్కెట్ యార్డు నిరుపయోగంగా ఉండటంతో ఒకరిని చూసి మరొకరు ఇలా రోడ్లపైనే విక్రయాలు చేస్తున్నారు. చీకటి సమయంలో హైదరాబాద్ - సాగర్ రాష్ట్ర రహదారిపై పలు సందర్భాల్లో వేగంగా వాహనాల రాకపోకలు ఉండటంతో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి



ఇటు హైదరాబాద్ - సాగర్ రహదా రి, అటు కోదాడ - జడ్చర్ల హైవేపై కూరగాయలు, చిరు వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో ప్రమాదాలు జ రిగే ఆస్కారం ఉంది. వాహనాలు వేగంగా వచ్చిపోతుండటంతో గతంలో ప్రమాదాలు జరిగాయి. అధికారులు చొరవ తీసుకొని రోడ్ల పక్కన విక్రయించకుండా అవగాహన కల్పించాలి. మార్కెట్ యార్డును వినియోగంలోకి తీసుకురావాలి.
- కుంభం యాదగిరి, కొండమల్లేపల్లి

రోడ్లపై వ్యాపారాలతో ట్రాఫిక్ సమస్య



రోడ్లకు ఇరువైపులా కూరగాయలు, చిరు వ్యాపారాలతో తరచూ ట్రాఫిక్ కు సమస్య నెలకొంటుంది. సొంత షాపులు ఉన్నవాళ్లు కూరగాయలను తమ సొంత మడిగలోనే విక్రయించేందుకు గతంలో గ్రామపంచాయతీ అనుమతి ఇచ్చింది. దీంతో పలువురు కోర్టును ఆశ్రయించడంతో చర్యలు తీసుకోలేకపోతున్నాం. త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- బాలరాజు, ఎంపీడీవో, కొండమల్లేపల్లి

గ్రూపు- 2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

● పరీక్షలకు హాజరుకానున్న 7,941 మంది అభ్యర్థులు
● సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్


సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్

మిర్యాలగూడ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సబ్ కలెక్టర్ మాలెంపాటి నారాయణఅమిత్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు 15, 16 తేదీల్లో జరిగే గ్రూపు -2 పరీక్షలకు పట్టణంలో 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలకు 7,941 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ స్ట్రాంగ్ రూమ్‌లో పరీక్షా పత్రాలు భద్రపరిచినట్లు ఆయన పేర్కొన్నారు. పోలీస్ ఎస్కార్ట్‌తో నాలుగు రూట్లలో పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలు రవాణా చేస్తారని తెలిపారు. నాలుగు పేపర్లకు రెండురోజుల పాటు పరీక్షల నిర్వహణ కొనసాగుతుందని వెల్లడించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు రెండో పేపర్ నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామన్నారు. పరీక్షలకు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌గా తహసీల్దార్లు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.

శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు


కుర్మేడ్ నుంచి శ్రీశైలానికి బయలుదేరుతున్న శివ స్వాములు

చింతపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మేడ్ గ్రామానికి చెందిన మాల ధరించిన 28 మంది శివస్వాములు శనివారం ఇరుముడి కట్టుకోని శ్రీశైలానికి బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కోటి గురుస్వామి, శేషాద్రి, కానుగుల ఆనంద్ గురుస్వాముల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 41 మండల దీక్ష పవిత్రంగా పూర్తి చేసుకొని భక్తిశ్రద్ధలతో ఇరుముడి కట్టుకొని శిరస్సుపై ధరించి వెళ్లారు. దీంతో గ్రామంలో శివ నామస్మరణతో మార్మోగింది. భక్తులకు తీర్థ ప్రసాదంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు నాదిరి సత్యనారాయణ, వాకిటి సైదులు, గజ్జ అనిల్‌కుమార్, నాగరాజు, చిక్కొండ శేఖర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మద్దిమడుగుకు దీక్ష స్వాముల పాదయాత్ర


పాదయాత్రగా బయలుదేరిన హనుమాన్ దీక్ష స్వాములు

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 30 మంది హనుమాన్‌దీక్ష స్వాములు శనివారం మద్దిమడుగు పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. అంతకుముందు స్థానిక హనుమాన్ దేవాలయంలో ఆంజనేయస్వాములకు ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నిమ్మల మహేందర్, ఎన్.మహేష్, భాస్కర్, అర్జున్, స్వామి, ఆంజనేయులు, వెంకన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ


పెదిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు శాగం పెద్దిరెడ్డి తల్లి శాంతమ్మ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మండల కేంద్రానికి చేరుకొని శాంతమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ సలహాదారుడు యడవెల్లి నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భగవాన్‌నాయక్, నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, గొడపర్తి ప్రసాద్, కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, రామేశ్వరి పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ హిల్‌కాలనీకి చెందిన నాట్కో విశ్రాంత ఉద్యోగి శ్రీనివాస్‌రావు శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మృతుని ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, నాయకులు కర్ణ బ్రహ్మారెడ్డి, శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెస్, కాస్మెటిక్ చార్జీల పెంపు శుభపరిణామం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను సుమారు 40 శాతానికి పైగా పెంచడం శుభపరిణామమని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం ఎస్టీ బాలురు గురుకుల పాఠశాలలో నూతన భోజన మెనూను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. వసతిగృహాల నిర్వాహకులు మెనూ ఖచ్చితంగా పాటించాలని, ఆహారం నాణ్యతతో పాటు పరిశుభ్రతతో పెట్టాలని సూచించారు. ఆహారంలో నాణ్యత కోసం హాస్టల్‌లో ఫుడ్ సెక్యూరిటీ కమిటీలను సైతం ఏర్పాటు చేశామన్నారు. హాస్టళ్లలో ఎలాంటి సమస్యలు వచ్చినా ప్రిన్సిపాల్ తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీవో రమేష్, ఇరిగేషన్ ఏఈ నరేష్, ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండ మండలం, కొండమల్లేపల్లి మండలంలోని పలు గురుకుల హాస్టళ్లను ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తనిఖీ చేశారు. అనంతరం ఆయా హాస్టళ్లలో నూతన మెనూ చార్ట్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ గురుకులాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం


దేవరకొండలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

మరింత నాణ్యమైన ఆహారాన్ని మెరుగైన విద్యాబోధన అందిస్తుందని అన్నారు. ప్రభుత్వం డైట్ చార్జీలను 40శాతం పెంచిందన్నారు. విద్యార్థులకు భోజనం వడ్డించి కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో నూతన మెనూను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కొండమల్లేపల్లి మండలంలోని చెన్నారం గేటు వద్ద ఉన్న ట్రైబల్ గురుకుల (బాలికల) పాఠశాలలో తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థినుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన బోర్‌వెల్ వాహనాన్ని పిలిపించి వేయించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో రమణారెడ్డి, ఆర్‌సీవో బాల్‌రాంనాయక్, ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మీ, సీఐ నరసింహులు, తహసీల్దార్ సంతోష్ కిరణ్, సీఐ నరసింహులు, తహసీల్దార్ సంతోష్ కిరన్, దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జమునమాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, ఉ ట్కూరి వేమన్‌రెడ్డి, యూనూస్, ఎంపీడీవో బాలరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లింగం, నాయకులు జగన్‌లాల్‌నాయక్, రాములునాయక్, ఆయా గురుకులాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నిడమనూరు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. నూతన


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

కామన్ డైట్ మెనూను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో డీటీడీవో రాజ్‌కుమార్, ఆర్సీవో స్వప్న, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ప్రిన్సిపాల్ చింతమళ్ల రాంబాబు, మాజీ జడ్పీటీసీ రామేశ్వరిమట్టారెడ్డి, మేరెడ్డి వెంకట్‌రాహుల్, యడవెల్లి వల్లభ్‌రెడ్డి, చినవీరయ్య, బొల్లం శ్రీనివాస్, నర్సింగు విజయ్‌కుమార్, పగిళ్ల శివ, ఆలంపల్లి మైసయ్య, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించారు. గురుకుల విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్యా వ్యవస్థను తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో బాలునాయక్, ప్రిన్సిపాల్ అరుణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

● పెద్దవూర మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పాఠశాలలో నూతన భోజన మెనూను మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, పగడాల నాగరాజు, శ్రీనివాస్, మురళి, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో తహసీల్దార్ అనిల్‌కుమార్ మెనూ చార్ట్‌ను ప్రారంభించి హాస్టల్‌లోని వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో వార్డెన్ రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సాగర్ హిల్‌కాలనీలో బీసీ గురుకుల పాఠశాలలో మునిసిపల్ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ, ఎంఈవో తరి రాములుతో కలిసి కామన్ డైట్‌ను ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమం లో ప్రిన్సిపాల్ రాజశేఖర్, కమిషనర్ శ్రీను, నాయకులు పాల్గొన్నారు.


నిడమనూరులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

● అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతిగృహంలో మండల ప్రత్యేక అధికారి దస్రునాయక్ మెనూచార్ట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మొహసిన్‌బిన్‌అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ మండలంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో బీసీ వెల్ఫేర్ అకాడమిక్ గైడెన్స్ అధికారి లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరిత, వైస్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, పీడీ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● గుర్రంపోడులో మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో గల మైనార్టీ


మిర్యాలగూడలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

జూనియర్ కళాశాలలో నూతన కామన్ డైట్ మెనూను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడారు. గురుకులాల్లో నాణ్యమైన భోజనంతో పాటు విద్య లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్‌ఫారుఖ్, ఏఎస్‌వో రాజశేఖర్, డీటీలు ఫరీద్, దీపిక్, ఆర్‌ఐసీఎస్ రావుల సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● హాలియాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో హాలియా మునిసిపల్ చైర్‌పర్సన్ యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, తహసీల్దార్ రఘు మాట్లాడారు. గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమానికి ఉపాధ్యాయ బృందం కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా చదువుకొని ఉన్నత స్థితికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎస్ఐ సతీష్‌రెడ్డి, ఆర్ఐ అశోక్‌రెడ్డి, గురుకుల ప్రిన్సిపాల్ భవాని, మునిసిపల్ మేనేజర్ రషీద్, సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● వేములపల్లి మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో నూతన మెనూను మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్నారో హాస్టల్ విద్యార్థులకు అదేవిధమైన మెనూను అందించాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ ఇన్‌చార్జి అవిరెండ్ల సైదులు, ఎంపీవో లలిత, ఏవో రుషేంద్రమణి పాల్గొన్నారు.

సాగర్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతా

● నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా, నాగార్జునసాగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. హాలియా, నందికొండ మునిసిపాలిటీల్లో శనివారం అమృత్ 2.0 పథకం కింద మంజూరైన నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి అవసరా లు తీర్చేందుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాటర్ ట్యాంకు నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. హాలియా మున్సిపాలిటీలో అమృత్ 2.0 స్కీం కింద మంజూరైన రూ. 15.20 కోట్లతో నిర్మిస్తున్న వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అమృత్ స్కీం కింద మంజూరైన రూ.15 కోట్లతో పాటు భవిష్యత్తులో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు మరో రూ.50 కోట్లు నీటి కో సమే ప్రతిపాదనలు చేశామని తెలిపారు. దీంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, మౌలిక వసతుల కల్పనకు రూ.200 కోట్లతో ప్రతిపాదనలు పూర్తి చేశామని త్వరలోనే నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు. పెరుగుతున్న జనాభా కు అనుగుణంగా మరో 30 సంవత్సరాల వరకు నీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్మిస్తున్నట్లు తెలిపారు. నందికొండ మునిసిపాలిటీలోని 1వ వార్డులో రూ.44 కోట్ల వ్యయంతో నిర్మించే ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. 16 సంవత్సరాల క్రితం నాటి మంత్రి జానారెడ్డి సాగర్ కాలనీలకు తాగునీటి అవసరాలు తీర్చడానికి ఫిల్టర్ హౌజ్‌లు నిర్మించారని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి అవసరాలను తీర్చేందుకే అమృత్ 2.0 పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మునిసిపాలిటీలో డిజిటల్ లైబ్రరీ, దోబీఘాట్, సమీకృత మార్కెట్, పైలాన్ కాలనీలో సెంట్రల్ లైటింగ్‌తో డివైడర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డ్యాం నుంచి జెన్‌కో కార్యాలయం వరకు రోడ్డు నిర్మాణాన్ని కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం సర్వే నిర్వహిస్తున్నామని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్లు యడవల్లి అనుపమనరేందర్‌రెడ్డి, తిరుమలకొండ అన్నపూర్ణ, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు కర్నాటి లింగారెడ్డి, పీసీసీ కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, కుందూరు వెంకట్‌రెడ్డి, చింతల చంద్రారెడ్డి, వర్ర వెంకట్‌రెడ్డి, ప్రసాద్‌నాయక్, నల్లబోతు వెంకటయ్య, శ్రీనివాస్, నాయకులు ఆంజనేయులు, గౌని రాజారమేష్‌యాదవ్, రాజాప్రసాద్, మాజీ జడ్పీటీసీలు అబ్బిడి కృష్ణారెడ్డి, కర్నాటి లింగారెడ్డి, నందికొండ రామేశ్వరీమట్టారెడ్డి, భానుచందర్‌రెడ్డి, పాండునాయక్, నాయకులు మంగ్త, రామకృష్ణ, కమిషనర్ శ్రీను, ఇంజనీర్లు బాలాజీ, నాయకులు శ్రీను, నాగరాజు, కాంట్రాక్టర్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.


హాలియాలో వాటర్‌ట్యాంక్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

వ్యర్థ పదార్థాలు తిని గొర్రె మృతి

మాడ్గులపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వ్యర్థ పదార్థాలు గొర్రె తిని మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని కల్వలపాలెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. లక్ష్మీదేవిగూడెం గ్రామ సమీపంలో ఉన్న ఫంక్షన్‌హాల్‌కు సంబంధించిన ఆహారాన్ని గ్రామ సమీపంలోని యేనె వద్ద పడవేశారు. గ్రామానికి చెందిన కడారి వెంకన్నకు చెందిన ఆరు గొర్రెలు ఆహారాన్ని తిన్నాయి. దీంతో ఒక గొర్రె తిని అక్కడికక్కడే మృతి చెందగా, ఐదు గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయని బాధితుడు వాపోయాడు. సుమారు తనకు రూ.20 వేల నష్టం జరిగిందని, వ్యర్థ పదార్థాలను కల్వలపాలెం గ్రామ సమీపంలో వేయకుండా చూడాలని బాధితుడు కోరాడు.

ఆర్థిక సహాయం అందజేత

మాడ్గులపల్లి, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బత్తిని సాంబయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గడ్డం పురుషోత్తంరెడ్డి మృతుని కుటుంబానికి మాజీ జడ్పీటీసీ పుల్లెంల సైదులుతో కలిసి రూ.5వేల ఆర్థిక సహాయం అందచేసి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలి

● సబ్ కలెక్టర్‌కు తాళ్లగడ్డ వాసుల వినతి

మిర్యాలగూడ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇళ్లు నిర్మించుకునేందుకు తమకు అవకావం కల్పించి న్యాయం చేయాలని తాళ్లగడ్డవాసులు సబ్ కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. శనివారం బాధితులు సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ పట్టణంతో తాము కొనుగోలు చేసిన సర్వే నెం. 60, 61లోని ప్లాట్లలో ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతించాలని కోరారు. తాళ్లగడ్డకు చెందిన వారు మాట్లాడుతూ మాదాసు లూర్ధరాజు పేరున 60, 61 సర్వే నెంబర్‌లో ఉన్న భూమిలో ఇతర గ్రామాల నుంచి బతుకుదెరువు కోసం పట్టణానికి వచ్చిన పేదలు ఇళ్ల స్థలాల కోసం గుంట, అరగుంట చొప్పున ఐదేళ్ల క్రితం కొనుగోలు చేశారని అన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆ భూమిని ప్రభుత్వ భూమిగా తేల్చి బోర్డు పాతారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కష్టపడి పనిచేసిన డబ్బులతో ఇంటి స్థలాలు కొనుగోలు చేశామని తెలిపారు. విచారణ జరిపి ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ మాట్లాడుతూ డ్యాకుమెంట్లు చూపితే చట్టప్రకారం న్యాయం జరిగేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. కౌన్సిలర్ బంటు రమేష్, మాజీ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, వెంకన్న ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో తాళ్లగడ్డ వాసులు జి. నాగరాజు, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య, షకీల్ అహ్మద్, గౌరి, మల్లయ్య, సరిత, సైదమ్మ, ప్రవీణ్, విజయ, ఫర్హాన, అక్బర్, జానీపాష పాల్గొన్నారు.

'బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం'

దేవరకొండ, చింతపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధికారి ప్రతినిధి కట్టా సుధాకర్ అన్నారు. దేవరకొండ, కొండమల్లేపల్లిలో శనివారం నిర్వహించిన పార్టీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి, అన్ని విధాలుగా విఫలమైందని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారే తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడం లేదని ఆయన విమర్శించారు. ఏం సాధించారని ప్రజాపాలన సంబురాలు నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు. గెలిచాక ఎలాంటి మార్పు లేకుండా ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ అమలు చేయకుండా కేవలం పత్రిక ప్రకటనలతో మోసం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దేశ ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయా సమావేశాల్లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేతావత్ లాల్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు వనం నరేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వస్కుల సుధాకర్, సైదులు, రత్లావత్, నాయకులు శివర్ల రమేష్‌యాదవ్, కేతావత్ లాలునాయక్, వెన్నం శేఖర్, శ్రీశైలం, అభినవ్, రాపర్తి సతీష్, తదితరులు పాల్గొన్నారు.